UNIVERSAL LIBRARY
OU_204015
UNIVERSAL LIBRARY

# ప్రపంచ చరిత్ర.

(గ్రీసు.)



కవిప్రపంచము హెూమరును బూజించుట.

# పీఠిక

## కూపస్థమండూకములు

'అతనికి ఇల్లే వారాణాసి, గడపే కైలాసము. అతఁడెక్కడ! కూపస్థమండూకము గాఁడా? అట్టి వానివలన నేమైన ఈషన్మాత్రము ఫలము కలుగునా?' అను దూషణ వాక్యములు మనము సాధారణముగ నప్పుడప్పుడువినుచు నేయుందుముగదా! అభ్యాసమువలన నలక్ష్యమందురు. అందుచేత నవిచారత్వము వహింతుము. పలుమారు ఈవిధముగా మనము మాటలాడుకొను చున్నామే. దీనికి మూలాధారమేమి? మనలోనుండు ఏ ఆశలవలన నిట్టి సాంప్రదాయము పుట్టినది? ఆ యాశలను పరిపూర్తిచేసికొనుటకు ఈమాత్రపు లోకోక్తులతోఁ గాలముపుచ్చిన చాలునా? ఇంక నేమైన ఘనకార్యములకు సమర్థులము కావలెనా? కావలసి యుండిన, మార్గము లేవి? అను నిట్టి ప్రశ్నలు అందఱకును పొడముట లేదు. కొందఱకు పొడమినను మన దౌర్భాగ్యవశమున నైన బలహీనత్వంబునఁ జేసియు, దాని మూలమున నైన ఉదాసీనత్వమునఁ జేసియు, ననేకులు 'ఈ గొడవలు మనకేల? ఏదో భూమిలో పుట్టినాము. గిట్ట

వలెను. ఈ లోపుగ చేతికందిన సుఖము లనుభవించి పోద ము. వెఱ్ఱితలపోతలతో నేమి? అవి యేమి కూడుపెట్టునా, గుడ్డలిచ్చునా? మనము ఆరువగలమా? తీరువగలమా? రా నిది రాక మానదు. నడుచునది నడువక నిలువదు అను వేదాంతములతోఁ గాలము గడపి తఱలిపోదురు. ఇట్టి వా రే ఇప్పటికిని ననేకులు.

## బ్రిటిషుప్రభుత్వపుఁజల్లఁదనము

కాని బ్రిటిషుసామ్రాజ్యపుఁ జల్లనినీడనఁ గొంతకా లముగఁ బాశ్చాత్యవిద్యాభ్యాసము మనకు సాధ్యమయి, తన్మూలముననే మన ప్రాచీనవైభవము తేటపడినందున మనకు మరల నాశలంకురింపఁ బ్రారంభించినవి. 'మన మును మనుష్యులమే. ఇతరులతో సమానులముకాఁగల వారమే. పూర్వము మన కాదిమపురుషు లనందగిన పెద్దలు మహోన్నతస్థితినుండ లేదా? ఈ నైచ్యము మన కేల? విసర్జింప లేమా?' యను నూహాలు ప్రబలజొచ్చినవి.

## పేదరాలుపెద్దమ్మ

పేదరాలుపెద్దమ్మ యల్పసంతోషి. ఏ కథలోఁ జదివి నను ఆమెచేత నొకబంగరునాణ్యము పెట్టి యుబ్బించి యొ క్కపూటలో రాజ్యములను గడించువారే కానవచ్చుచున్నా రు. ఆమె యెప్పుడును పేదరాలుపెద్దమ్మే. మఱి వారితప్పా? కాదు. ఆమెకంతే జ్ఞానము. అంతే ఫలము. వారికెక్కుడు

జ్ఞానము. ఎక్కుడు ఫలము. ఇతరులు తన పూర్వవృత్తమును పొగడుటచేతను తా నెప్పుడును జూడని కాసు చేతఁబెట్టుట చేతను ఆమె తబ్బిబ్బులగు. అట్లే మనవారనేకులు ఋషుల కాలపువైభవకథనమును విని పొంగిపొరలి, తబ్బిబ్బయి, స్మృతిదప్పి, కన్ను మిన్నుగానక మిన్నక యుందురు. ఇట్టిచరిత్ర మూఢస్త్రీయగు పేదరాలుపెద్దమ్మకే దగును గాని, నవనాగరికసారమును చూరగొని, గార్గిమైత్రేయ్యాదినారీరత్నముల మరల దలపింప నాశగల మన సోదరీమణులకుం గాని, విద్యాధురంధరులయి మగతనముం బచరింప నుంకించు మన సోదరులకుం గాని యసంభావ్యంబె.

## నిండులోకము

మధ్యకాలమున నొకవేళ మనము కూపస్థమండుకములయి యుంటిమేమో కాని ఇప్పటి కాలమున మాత్రము మనము నిండులోకములోనికిం ద్రోయఁబడినారము. నిమీలితలోచనులమై ముక్కుమూసికొనిన నీ లోకము మనకదృశ్యమై మనము పరమపదమందుట నిజమగునేమో కాని, ఈ పదమందు మాత్రము నెగ్గుదు మనుమాట కల్ల. అట్లగుట గతకాలము నెఱింగి, వర్తమానమును విమర్శించి, భవిష్యత్తును నిరూపించికొనగ గడంగుట ఇప్పటి కర్తవ్యము. ఇట్టిజ్ఞానమే ముఖ్యతమము. దీనినే చరిత్రజ్ఞానమందుము.

ఈ జ్ఞానము వ్యాపింపఁజేయు నుద్దేశముననే నే నీ ప్రపంచచరిత్రమును ప్రకటింప తలపెట్టితిని. పాశ్చాత్యభా

షాకోవిదులకు రుచించురీతిని విషయములను క్రోడీకరించు
ట కష్టతరము. పౌరస్త్యపండితమండలి కామోదము గలుగు
నట్లు భాషం దీర్చుట కష్టతమము. ఈ రెండుకార్యంబుల
కును నే వలంతినిగాను. అయినను నాంధ్రదేశమున గొం
తకుగొంతయయిన విజ్ఞానము వ్యాపింపఁజేయ సమకట్టి
సాహసించితి. ఉభయవిధపండితులును నాలోపంబుల
క్షమించి నన్ను మన్నింతురు గాకయని ప్రార్థన.

ఇట్లు
బుధవిధేయుఁడు
గా. హరిసర్వోత్తమరావు.

# ఉపోద్ఘాతము

శిక్షలలో శిక్ష మనుష్యునకుఁ జీఁకటికొట్టుశిక్ష. బందిఖానాయం దీశిక్ష ననుభవింపవలసినవారికయి ప్రత్యేకముగఁ గొట్టులు కట్టఁబడియుండును. ఆ కొట్టులలోనికి వెలుతురును గాలియు ప్రసరించుటకు వాని వెనుకటి గోడకు పైభాగమున నొకకిటికీ యుండును. కొట్టువాకిలి పూర్ణముగా మూయఁబడును. పహరావాఁడు లోపలిఖైదీని చూచుటకు ఆవాకిట హస్తము పట్టునంత మాత్రము బిలము గలదు. కొన్నికొన్ని యెడల అన్నపానాదులను లోపలికిఁ జేర్చుటకు దగిన ఏర్పాటులు మరలసాయమున గోడలలోఁ జేయఁబడి యున్నవి గాని సర్వసాధారణముగాఁ జీఁకటికొట్టుఖైదీ భోజనాదులకు బయటకుఁ దీయఁబడుచునే యుండును. అప్పుడితరమానవులను జూచుటకును ఒకరిద్దఱితో నొకటిరెండుమాటలఁ బల్కుకొనుటకును అతనికి దప్పక యవకాశము కల్గుచున్నది. ఇట్లుండియు నీ శిక్ష యెట్టివానికిని విశేషకారణము లేక వారము దినములకు మించి విధింపరాదని చట్టము. ఏలయన అంతకంటె నెక్కుడైన యెడల మానవునకుఁ జిత్తభ్రమ కలిగి వెఱ్ఱియెత్తునని కనుఁగొనఁబడినదిగాన.

## సంఘభావము

మానవుఁడు ఒంటిగా నుండఁజాలఁడనుట దీనివలన విదితమగుచున్నది. అనాగరికులై గుడ్డలు కట్టుకొననైన నెఱుఁగని యడవిజాతులవారి జీవితచరిత్రమును, ఈ విషయమునే బలపఱచుచున్నది. తుట్టతుదకు మానవునకుఁ నీషత్పూర్వసృష్టియగు వానరములును భద్రేభాదిమహాజంతువులునుగూడ యూథములు యూథములుగ నివసించుచు సంఘీభావమునే స్థిరపఱచుచున్నవి.

## మానవుఁడు

అయిన మానవుని సంఘీభావమునకును ఇతరజంతువుల సంఘీభావమునకును తారతమ్యము కలదు. ఆ విభేదము వలననే మానవుఁడు 'మానవుఁ' డనిపించుకొనుచున్నాఁడు. అది లేకున్న నితఁడును నా జంతువులతో సమానముగ నొకవింతజంతువేయై యుండును. ఇతనికి దైవము బుద్ధి, అనగా వివేచనయు సంకల్పశక్తియు, వీనికి తోడుగ సంభాషణ బలమును ఇచ్చియున్నాఁడు. వీని నీతఁ డభివృద్ధిపఱచుకొనుకొలఁది ననుసరించి ఇతరసృష్టి యంతయు నీతనికిఁ గ్రమక్రమగ లోఁబడుచు వచ్చుచున్నది. ఈతని సంఘీభావ స్వరూపమును తదనుగుణముగ మారుచు వచ్చుచున్నది. సంఘీభావస్వరూపము మారుటయు మానవుని జ్ఞాన మభివృద్ధియగుటయు ననునవి రెండును పరస్పరకార్యకారణములగుట వీనిలో పరాపరంబుల నిర్దేశించుట సాధ్యముకాని

పని. అట్లయ్యు నేదో యొక విధమున వీని యభివృద్ధిని సమన్వయము చేయవలసి యున్నది గాన కొంత వివరించెదము.

తక్కిన జంతువుల వలె వట్టియరపుమాత్రముతో నిలువక తాను కలిగించు ధ్వనులను ఆదిమశబ్దముల క్రిందికి మార్చి ఆ శబ్దములను బుద్ధియందు నిలిపి వాడుటకుఁ బ్రారంభించుటతోడన మానవుఁడు 'మానవుఁ'డై యుండును. ఈ స్థితి యెప్పుడు తటస్థించినదియు నిర్ణయించి చెప్పుటకుఁ గాదు. ఎన్నియుగములో యై యుండనోపు. వాక్కు తీరుటయు జ్ఞానోదయంబును నేకసమయంబున నయ్యె ననుట మాత్రము నిజము. అప్పటినుండియు మనుష్యుఁడు తన చుట్టుముట్టునుగల ప్రకృతిని పరిశీలింపఁ బ్రారంభించి యుండును. మానవున కప్పుడే బాంధవ్యస్ఫురణ కూడఁ గలిగెననుటయుం దప్పు కానేరదు. స్వభావముచేతనే మానవుని యం దీయంకుర ముండెననుటకు, అతనికి నీషత్పూర్వసృష్టి యని శాస్త్రజ్ఞులు నిర్ణయించిన వానరజాతి మున్నగువాని యభ్యాసములే సాక్షులు. అట్లగుటచే మానవుఁడు వాక్స్వరూపవరమును బడసిన కొలఁదికాలముననే సంఘీభావపు మర్మము నెఱింగియుండును.

కనుగొనుట

ఇటీవల పాశ్చాత్యశాస్త్రజ్ఞులు భూగర్భశాస్త్ర మాధారము చేసికొని యచ్చటచ్చట గనులను దీసి వానియందు

వెలువడిన ఆయుధములు, చిత్తరువులతోడి పెంకులు, శిథిల నిర్మాణములు, అస్థిపంజరములు, జంతుజాలంపునిలువలు, మొదలుగాఁ గలవాని నన్నిటిని బరిశీలించి చరిత్రకాలమునకు యుగములుముందుండిన మానవుని జీవితమునందలి విశేషములను బయలుపఱచి యున్నారు.

## రెండు మార్గములు

మొట్టమొదట నీతనికి ఇతర జంతుసంతానమంతయు శత్రువర్గమెయయి యుండును. వేటయే జీవనాధారంబుగ నుండునప్పు డితఁడు రాతిపై రాతిని గొట్టి మొద్దుగ నాయుధములఁ దీర్చికొని యుక్తిచే మహాజంతువుల నన్నిటిని లోఁబఱచుకొన మొదలిడి యుండును. ఇట్టి యాయుధము లనేకములు శాస్త్రజ్ఞులు పరిశోధించుటలో దొరకినవి. మన మిప్పుడెఱుంగని మహాజంతువుల యస్థిపంజరములును దొరకినవి. అందు కొన్ని మన యేనుఁగును దున్నవలె గన్పింపఁజేయు నంతటివి గలవు. వానితో నప్పటి మానవుఁడు పోరాడిగెల్చినట్లు నిదర్శనములున్నవి. ప్రారంభదశయం దాయుధములు మోటుగ నున్నను రానురాను అవి సున్నితములు గాఁజొచ్చెను. తన్ను నెదురించు జంతువుల గోరుల స్వభావమును జూచి రాతిని రాచి మానవుఁడు ఆయుధములఁ దీర్పఁజొచ్చెను.

కఱకురాతిని ఆయుధములుగ నుపయోగించిన కాలమును సున్నితమైన రాతియాయుధముల నుపయోగించిన

కాలమును వేఱుపఱచి శాస్త్రజ్ఞులు 'శిలాయుగము' 'నవశిలాయుగము' అని మానవుని పరిణామచరిత్రము నందలి ప్రాథమికావస్థలను బేర్కొనియున్నారు.

## శిలాయుగము

ఈ యుగమునకుఁ జేరినయాయుధములు మూడు తెఱంగులవి గానవచ్చుచున్నవి. ఈటెతలలఁ బోలునవియు, గండ్రగొడ్డండ్లఁ బోలునవియు, పిడికత్తులఁ బోలునవియు నగు నాయుధములను శిలాయుగంపు మనుష్యుఁడు కైలాఘువము చూపి రాతితో రాతిని నఱకి తీర్చికొనుచుండెను. ఈ యాయుధముల సాక్ష్యమును బట్టి ఇతఁడు వేటాడియును చేపలఁ బట్టుకొనియు జీవించుచుండెనని తేలుచున్నది. తనకు సాహాయ్యముగ కుక్కమున్నగు జంతువులను బెంచుకొనుట గానరాదు. మట్టిపాత్రలఁ జేసికొనుటయు నతఁ డెఱుంగఁడు. అడవియందు కొమ్మకు కొమ్మ రాచుకొని యగ్నిపుట్టుటను గమనించికాఁబోలు నగ్గి రగుల్చుటకు నేర్చి, యతఁడు దానిని పచనకార్యముల కుపయోగించునంతటి వాఁ డయియుండెను. కణితవంటి జంతువుల యెముకలను దన యాయుధసామగ్రిచే సూదులను చంచాలను బోలు నుపకరణములుగ మార్చుకొనుచుండెను. కట్టుటకు నుపయోగపడు వస్తువులు గానవచ్చుటచేత నితఁడు జంతువుల ప్రేవుల నీపనికయ్యు, కుట్టుటకయ్యు సిద్ధము చేసికొనుచుండె నని యూహింపవచ్చును. ఇతఁడు బహు

శః తాఁ జంపిన మృగముల తోళుల నంబరములుగఁ దాల్చుచుండెను గాఁబోలు. ఈతని నివాసస్థానములు సాధారణముగా గుహలు. పెద్దపెద్దజంతువులను జంపుటకు శక్తికలవాఁడయ్యు మహాయుధములు లేనివాఁడగుటచే నీ తఁడు యుక్తిచేసి గుంతలు మున్నగునవి త్రవ్వి ఇప్పుడు మన మేనుఁగును బట్టువిధమున వానిని బట్టుచుండెను. ఇతఁ డిండ్లుకట్టుకొనినట్లును నిదర్శనములు గలవు. ఒకవిధమగు నంటప్రొయ్యినిర్మాణము మాత్ర మితనికి సాధారణము. ఈ తఁడు ఎముకలపై విడిచి పోయియుండు కత్తికాటులను బట్టి యొకవేళ నీతనికి లెక్కపెట్టుకొను శక్తియుఁ గూడ నుండె నేమోయను సందేహము కలుగుచున్నది.

## నవశిలాయుగము

నవశిలాయుగమున నీ రాతియాయుధములే సున్నితములయ్యెను. రాతిపై రాతిని బెట్టికొట్టుటయే గాక రాతితో రాతిని రాచి సాపుచేయుటయు పిల్లువేయుటయు ప్రారంభమాయెను. ఈ యుగముననే పశుపాలనమును వ్యవసాయమును మొదలయినట్లు కానవచ్చుచున్నది. వీని తోడనే పిండివిసరుకొని వంటచేసికొను నలవాటు పొడ చూపి యుండును. కుమ్మరపనియు, వడుకుటయు, నేయుటయు నీకాలముననే గానవచ్చుచున్నవి. కుమ్మరమునకు సహాయకారి చిత్రలేఖనము. అట్టి చిత్రలేఖనము కూడ

నగుపడుచున్నది. దానిని సహాయము చేసికొని అప్పుడు వ్రాతయుండెనా యనువిషయమును బరీక్షింపనగునేమో యని కొందఱు చరిత్రశాస్త్రజ్ఞు లాలోచనలు పరపుచు న్నారు. మనకు కాన్పించిన అక్కాలపు నివాసస్థానము లను బట్టి ప్రాథమిక గృహనిర్మాణపద్ధతి గొంతం దెలియుట యేగాక శిలాయుగపుమానవుడు వదలిపోయిన గొప్పరాతి కట్టడము లాతఁడు చారిత్రకయుగమున కెంతో దూరమున నుండ లేదనుటయు విశదపరుచుచున్నవి. కుక్కలును గుఱ్ఱ ములును ఎద్దును మచ్చికపడియుండిన వనుటయు తెల్లంబె. అన్నిటికంటెను ముఖ్యమయిన సంగతి యొకటి కలదు. శిలాయుగపు మానవుడు బందుగులు మరణించిన సమాధి చేయుచుండువాఁడు. ఆత్మయొకటి కలదనియు నది వినాశ రహితంబనియు నమ్మకముండిననే తప్ప ఈ యాచారము కలుగదు. అట్లగుటచేత నీ నవశిలాయుగమునం దట్టినమ్మక ముండెననుట నిక్కువము.

పైజెప్పిన విషయము లన్నిటిని బట్టి నవశిలాయుగము అంతమగులోపల మానవుడు కొంత యభివృద్ధినందిన సాం ఘికజీవనము గలవాఁడుగనుండెననుట స్పష్టమయి యున్నది. అయినను నిది యనాగరికస్థితి యనియే చెప్పనొప్పును. ఈ స్థితియందుండు నడవిజాతులవారిప్పటికిని గానవచ్చు చున్నారు.

## లోహయుగము

నాగరకమునకు దారిజూపినవి లోహములు. మానవుఁడు వానిని కరగి మేళవించి యుపయోగించుకొనుటకు ప్రారంభించుట తోడన నాగరకలోక మహాద్వారమున ప్రవేశించినవాఁడయ్యెను. ఈలోహయుగంబును గూడ శాస్త్రజ్ఞులు రెండు విభాగములు చేసియున్నారు. రాగి మిక్కిలి మెత్తని లోహమగుటచేత నది మొట్టమొదట యుపయోగమునకు వచ్చియుండును. దానితోఁ జేయబడిన యాయుధము లనేకములు త్రవ్వి యెత్తబడియున్నవి. కొంత కాలమునకు బిదప రాగితో తగరమును మేళవించి కంచును జేయుట సులభమై యుండును. లోహయుగమున నీ భాగమునకు 'కాంశ్యయుగ'మని వ్యవహారము గలదు. ఈ యుగమునకు వచ్చునప్పటికి కొన్ని మంచిసౌకర్యములతో నొప్పు సంతపట్టణములు గానవచ్చుచున్నవి. అప్పు డుత్పత్తియయిన వస్తువులను నాగరకమును గనబఱచుచున్నవి. క్రమక్రమముగ వెండిబంగారములును తుదకు నినుమును నుపయోగించుకొన నెఱింగి మానవుఁడు ఇప్పటియుగమున బడినాఁడు. ఈ యుగంపు ప్రారంభమే చరిత్రకు ప్రారంభము.

# గ్రీసు దేశ చరిత్రము

## మొదటి ప్రకరణము*

పాశ్చాత్యరాష్ట్రములలోఁ దొలుదొల్త నాగరకత వహించి తఱువాతిరాజ్యములకు ననేక విషయముల మార్గదర్శకత్వముపూని ప్రసిద్ధిగాంచిన జాతులయందెల్ల గ్రీకులు మున్నెన్నఁదగియున్నారు. వీరి దేశము సర్వసాధారణముగ గ్రీసని వ్యవహరింపఁబడుచున్నది. ఇయ్యది ఐరోపాఖండమున నాగ్నేయపు మూలనున్నది. ఆశియాఖండమునకును ఈ దేశమునకును మధ్యఁ గొంత సముద్రమును గొన్ని ద్వీపములును దప్ప మఱేమియులేదు. దేశముయొక్క స్వరూపము తచ్చరిత్రాంశములను గొన్నిఁటిని నిర్ణయించుటకుఁ బ్రబలమగు సాహాయ్యముగాన దేశస్వరూపవర్ణన ప్రతిదేశచరిత్రనుందును మొదటి యధ్యాయముగఁ బరిగణింపఁబడియున్నది.

సామాన్యవర్ణన

విస్తీర్ణమునందు గ్రీసుదేశ మించుమించు ౨౮,౫౦౦ చదరపుమైళ్లు గలదు. ఇయ్యది కొంచెము తక్కువగ సంపూర్ణముగ సముద్రముచేఁ జుట్టఁబడియున్నది. దీని తటరేఖ మిక్కిలి వంకర టింకర

* ఈ ప్రకరణము చదువునెడ దేశపటము చూచుచుండఁగవలసినది.

వై యసంఖ్యాకంబులగు నాఖాతంబు (సంయుక్తాగ్రగు డము-gulf) లకును సింధుశాఖలకును ఎడమిచ్చుచున్నది. తీరమున కనతిదూరంబునఁ జుట్టును బెద్దవియుఁ జిన్నవియు నగు ద్వీపము లనేకములు గలవు. ఇద్దేశమున భూమి యంత సారవంతమయినదిగాదు. ఎటఁజూచినను పర్వత ములే పొడసూపుచుండును. గుట్టలు దృష్టిపథంబునుండి తొలఁగునంతటి సమభాగ మెచ్చటను గానరాదు. ఏదో యొక పర్వతపజ్త్కి పదునైదుమైళ్లకంటె నెక్కుడెడముగల ప్రదేశ మొక్కటియును లేదు. కొంచెము విరివియైన బయళ్లు మూఁడు గలవుగాని ఈ మూటిని జేర్చినను దేశ విస్తీర్ణమున నారవవంతైననుంగాదు.

కావున గ్రీసుదేశ స్వరూపమున విశేషాంగము పర్వ తములనియే చెప్పనొప్పును. ఇయ్యవి యౌన్నత్యమున నంత పేరువడసినవిగావు. ఉన్నతతమమగు

పర్వతములు

'ఒలింపియను' శిఖరము సముద్రపుమట్ట మునకు పదివేలయడుగులకుఁ బైఁబడియుండదు. కాని ఈ దేశపు భూధరము లెల్లయు మిక్కిలి విషమములై దృషదు దుల కాకరమౌక తీక్ష్ణశిలాజాలములై యుండును. సృష్టి వైచిత్ర్యమేమియోగాని యిచ్చటి కొండ లెల్లయు గండ శిలలకును, నగాధమగు లోయలకును, గొప్ప చరుల కును బుట్టినిండ్లగుటచేత నొక్క యుపత్యకమునుండి

(valley)* ప్రక్క యుపత్యకమునకుఁ బోవుట దుర్లభము. ఎత్తుచేత యొక మండలంబునుండి మఱియొకమండలమునకు రాక పోకలు దుర్ఘటము చేయఁజాలునని తోఁపించినను ఇచ్చటి గుట్టలు పైజెప్పిన కారణమువలన నట్టి సంబంధములకు బలవత్తమమగు నాటంకములె యయి యున్నవి. ఒక ప్రదేశమునుండి మఱియొక ప్రదేశమునకుఁ బోవుటకు బాటలే యరుదు. ఏదోయొక మార్గముగుపడినను అయ్యది కఱకురాళ్లవఱపు గలిగి సందుగొందులతోఁ గూడిన డొంకల ననుసరించి దుస్సాధ్యంబయి యుండును. ఆయా ప్రదేశమునందలి యాయా తెగకు శత్రుజనంబులు రాఁగలుగు మార్గములు దెలిసియుండుటం జేసియు అట్టి మార్గముల నెంతటి సైన్యము లెదిర్చినను ధీరులగు కొందఱుమాత్రమే సంరక్షింపఁ గలుగుటంబట్టియు గ్రీసునందు స్వతంత్రజీవులగు చిన్న చిన్న సంఘము లెన్నియో నివసింపఁ బ్రకృతియె నిర్ణయించి నట్లగుపడుచున్నది.

గ్రీసు పర్వతముల యునికియం దెంతమాత్రము క్రమము గానుపింపదు. దాని యాకారమును జూచిన వెన్నెముకనుండి వ్యాపించుఁ బ్రక్కయెముక లొక్కొకచోఁ జ్ఞప్తికివచ్చును. ఒక్కొకచో నత్తగుల్లకంకాణము మనోగోచరంబగు. మఱి కొన్నియెడల సాలెపురుగుగూడు స్మర

* కొండల నడుమ నిడివి ఎక్కువకల ప్రదేశము.

గా పథంబు నాక్రమించు. ఇట్లగుట నిర్దేశ పర్వతముల యందు శాఖ లొకటికొకటి సమకోణముగ వ్యాపించి యుండుటయుఁ బటాలున తిరిగి సమానాంతరములగు టయు సమానాంతరములుగనుండి యకస్మాత్తుగ మఱల గలయుటయు మున్నగు చిత్రములు గన్పట్టును. ఏదోయొక పర్వతపజ్త్తి ననుసరించి నడచుచుంటిమేని యద్దానియందు హాటాత్తుగ ఇఱుకులై యగాధములగు లోయలు లెక్కలేక మన మార్గము నాటంకపఱచును. ఒక్కొక ప్రదేశమున పర్వతశాఖ యింకను వ్యాపించునుగదా యని తలంచు చుండ నొక్కొస్డడి ఆగిపోవుటయుఁ గలదు. అచ్చటచ్చట గుట్టలచేఁ జుట్టఁబడిన ప్రదేశములఁ గొన్నిఁట ప్రోవగు జలం బులు ప్రవహించు మార్గమే కానరాదు. మఱి కొన్ని స్థలం బుల సముద్రవాహిని పర్వతశాఖలలోఁ గ్రిందిభాగముల దొలఁచుచుఁ జొచ్చి కడుదవ్వు వాని యంతర్భాగమును చుట్టలు చుట్టలుగ నాక్రమించుకొనుటయుఁ జూడనగును.

గ్రీసుపర్వత పజ్త్తులును శిఖరములును గోడ్డుపడిన విష మశిలాక్రాంతములే యయినను శాఖలయం దటనటఁ బూర్వకాలమున నడవిప్రదేశములుండక పోలేదు. ఉత్తర గ్రీసునందు "పెలియను" "పర్నాసను" అను శాఖలసాను వులయందును పెలిప్పొనీసను అనఁగా దక్షిణగ్రీసునందును 'ఆర్కేడి'యా యను మండలంబునను దేవదారి, ఓకు మున్నగు వృక్షములంతో నిండిన కనుమలుండెడిని. కాని

ఎచ్చటను విస్తారమయి దట్టమగు నడవిమాత్రము గాన వచ్చుటలేదు.

ఏ దేశమందుగాని పర్వతముల స్వరూపము నదుల పోకడలను నిర్ణయింపఁగలదు. గొప్ప పర్వత పఙ్క్తులును

నదులు

మెల్లగ దిగు నేటవాలులును విశాలమగు పరిసరభూములును గలచో నదులు పొడవులై వెడదలై గంభీర ప్రవాహముగలవై యుండును. ఎక్కడఁ జూచిన లెక్కకుమీరిన గుట్టలచేఁ గప్పఁబడి గుప్పనదిగ జారు నేటవాలులు గలిగి బయలుప్రదేశమే యరుదగు గ్రీసుపోలిన దేశమందు నదులు నదులుగాక సెలయేళ్లే యగును. వర్షములు గురియ నియ్యేరులు బాణవేగమునఁ బర్వత పార్శ్వములనుండి దిగి యెదురుపడిన వస్తుసముదాయమునెల్ల తమ ప్రవాహమున దీసికొనిపోయి సముద్రమున కర్పించుచుండును. తక్కుంగల ఋతువుల నీ నదులెండిపోయి త్రోవయే దుర్లభమగు ప్రాంతములకు బాటలుగ నుపచరించుచుండును. దూకుడుఁగల ఝరంబులగుట నీ నదులు పడవల రాక పోకల కేమాత్రమును ఉపయోగపడుటలేదు. కాని యప్పుడప్పుడు దమపారుదల క్రిందిభాగమునఁ గర్షకులచే పైరువెట్టఁబడిన సస్యములను మాత్రము నశింపఁజేయుచుండును. గ్రీకు లీ నదుల యధిష్ఠాన దేవతలను వృషభాననులుగను మనుష్యదేహులుగను వర్ణించియున్నారు. దీని యర్థము గనుగొనుట కెంతో ప్రయ

త్నింపఁబనిలేదు. ఆననము దూకుడును దేహము చెడుపు చేయఁగల మానవుని యుక్తిని సంకేతించుచున్నవి. గ్రీసుదేశమునందంతటను వెదకినను సర్వకాలము ప్రవహించుచు నదీ నామమున కర్హములగు నేరులు మూఁడునాలుగుగలవు. అయ్యవి గ్రీసు విభాగముల వర్ణించునెడఁ బేర్కొనఁబడును.

ఈ దేశమునందు సరోవరము లేర్పడుటకు ముఖ్యకారణ మయ్యా ప్రదేశములఁ బ్రోవగు నీరు ప్రవహించిపోవుటకు మార్గము లేకపోవుటయే. అయిన నెక్కుడగు నుదకములు చేరినఁ జుట్టు దేశమునకు భంగము గలుగదాయనిన కరుణాళుండగు భగవంతుఁడు ప్రకృతియందు నివారణకారణం బేర్పఱచియున్నాఁడు.

సరోవరములు

అన్ని సున్నపురాళ్ల ప్రదేశములయందును పడిననీళ్లు అచ్చట నింకిపోయి క్రింది మట్టముగల యుపత్యకములో పొడసూపుచుండును. కాని ఒక్కొక్క సమయమున ఇంకుదల మార్గములు ఏదోయొక హేతువుచే మూసికొనిపోయిన యెడల నీళ్లెచ్చటి వచ్చటనె నిలిచి ఆయా యుపత్యకముల నింపివేయును. స్వాభావికముగనో, మనుష్యప్రయత్నముననో సరోవరవిస్తీర్ణ మెక్కుడు చేయఁబడెనేని సూర్యాతపమునకు జలము లదృశ్యంబగును. కాక నిలిచినచో గొప్ప గొప్ప బాడువ (బురదగుంత) లేర్పడును. ఇట్టి బాడువ లీ దేశమున ననేకములు గలవు.

తటరేఖాపరిమితివలన గ్రీసుదేశమునందు పడవల రాకపోకలకు మార్గము లేనినదులు లేవను కొఱంత ఏమాత్రమును గాన్పించుటలేదు. దేశము చిన్నదియె యైనను తటరేఖమాత్రము మిక్కిలి నిడివిగలది. ఎచటజూచినను ఏదో యొక సముద్రపుశాఖ దేశములోనికి దూరుచునే యుండును. కొరింతు ఖాడీ ఇట్టి సముద్రపు శాఖలలో గొప్పవాని కుదాహరణము. ఇట్టి ఖాడీలు చిన్నవియు గొప్పవియు గణనాతీతంబులు. ఎట్టివి యైనను లోతుగనుండుటం జేసి చక్కని నీటిబాటలై యలరారుచున్నవి. గ్రీసులో ఇట్టి నీటిబాటలకు నలుబది మైళ్లకు పైబడు దూరమున నుండు ప్రదేశమే లేదనిన నీ దేశమునకును సముద్రునకును గల మైత్రి తేటపడంగలదు.

తటరేఖ

పర్వతములకును, పీఠ భూములకును, సముద్రతీరమునకును నెలవగుటచేత గ్రీసుదేశము సమశీతోష్ణముల కాటపట్టయి యున్నది. వేసవియుష్ణము పీఠ భూములయందు వాని యౌన్నత్యము వలన తగ్గుడువడుచుండును. ఇంతియకాక దేశమునం బ్రతి భాగమునకును సముద్ర వాయువులు ప్రసరించుటవలన నెంత గ్రీష్మమైనను గాలము రమణీయముగా నుండును. పూర్వకాలమున, అనగా మానవుని గొడ్డలి యడవులను ఛేదించివేయకమున్ను గ్రీసుదేశపు శీతోష్ణస్థితి యిప్పటి కంటె నెక్కుడు ఆహ్లాదకారిగ నుండియుండును. అందు

శీతోష్ణస్థితి

వలననే పురాతనగ్రీకులు ప్రకృతి తమకు సారవంతమగు క్షేత్రముల నియ్యకున్నను ఏరికిని లేని యుత్తమమగు శీతోష్ణస్థితిని ప్రసాదించి గౌరవించెనని సంతోషపడుచుండిరి.

స్వాభావిక స్వరూపమువలన గ్రీసు మూఁడుభాగములుగఁ గనుపించుచున్నది. "థెస్సలి" "ఎపిరసు" అను రెండు మండలములు, ఉత్తరపు టెల్లకును దక్షిణమున "అంబ్రేసియను" "మేలియన"ను రెండు ఖాడీలకును నడుమనిమిడి ఉత్తరగ్రీసు నాఁ బరగుచున్నది. పైఁజెప్పిన రెండు ఖాడీలకును మధ్యనుండు భూప్రదేశపు నిడివి అరువదియైదు మైళ్లు.

విభాగములు

ఈ ఖాడీలకు దక్షిణమున భూభాగము మఱల నైఋత్యమునంది కారింతుఖాడీ యక్షమునగులునఱకు వ్యాపించియున్నది. ఇందే 'అకర్నేనియా' 'ఇటోలియా' 'డోరిసు' 'లోక్రిసు' 'ఫోసిసు' 'బియోషియా' 'అట్టికా' 'మిగారిసు' అను మండలములున్నవి. ఇదియే మధ్యగ్రీసు.

మధ్యగ్రీసును దక్షిణగ్రీసుతోఁ జేర్చు భూభాగసంధి మూఁడున్నరమైళ్లకంటె నెక్కుడు వెడల్పు గలదిగాదు. దక్షిణగ్రీసునకు పెలిపొనీసను అను నామాంతరముగలదు. ఇందు 'ఆకియా' 'కొరింతియా' 'ఆర్గాలిస్' 'లకోనియా' 'మెస్సీనియా' 'ఎలిస్' 'ఆర్కేడియా' అను మండలములు గలవు.

ఉత్తరగ్రీసునందలి ఎపిరసు, థెస్సలీ ఈ రెండుమండల ములను 'పిండసు' అను పర్వతపఙ్క్తి వేఱుసేయుచున్నది.

ఎపిరసు

ఎపిరసీ పర్వతము వరుసననుసరించి యేర్పడుచుండు నుపత్యకములచే నాక్రమింపఁబడి యున్నది. గుట్టలు తటరేఖకు బహు సమీపమున నుండుటచే నుత్తరార్ధమునందలి తీరభూమి వట్టి రాతినేలయై యున్నది. దక్షిణార్ధమున నొకటి రెండు మంచి బందరులు (Harbours) గలవు. ప్రాచీనకాలమున సోదెల కాటపట్టని పేరుఁ గాంచిన 'డొడోనా' యను పట్టణము మాత్ర మిందుఁ బేర్కొనఁ దగినది. ఈ మండలమునకు వాయవ్య మూలన బహుస్వల్ప వైశాల్యముఁగల సముద్రశాఖచే గ్రీసు ముఖ్యభూమినుండి తొలఁగింపఁబడి నిలిచిన కార్సైరా యను పొడవగు ద్వీపముగలదు. ఇదియుఁ దత్పూర్వ ముఖ్య భూమింబలె నిస్సారంబగు విషమ ప్రదేశముల కావాసమై యున్నది.

పిండసుపర్వతపఙ్క్తికిఁ దూర్పుననుండు మండలమే థెస్సలీ. ఇయ్యది గొంచెమించుమించుగ నాలుగుప్రక్కలఁ

థెస్సలీ

బర్వతములచేఁ జుట్టఁబడిన గొప్పబయలు. దీని కుత్తరమున 'కంబ్యూనై' పర్వతముల వరుసగలదు. ఈ వరుస మండలమున కీశాన్యమూలవఱకు వ్యాపించి యచ్చట సముద్రమునకు సమీపమున 'ఒలింపసు' అను శిఖరమున నంతమగుచున్నది. ఇదియే గ్రీసునందున్నత

తమమైనది. దీని నే దివిజావాసమని గ్రీకులు పారంపర్య ముగ వాడుకొనుచుండిరి. దీనికిని థెస్సలీ తూర్పుగోడ యనదగు 'మగ్నీసియను' పజ్త్తులందలి యుత్తరశిఖరమయిన 'ఒస్సా'కును మధ్యభాగమెంతో వెడల్పు లేని బహు రమణీ యంబగు "టెంపి" కనుమ. ఈ ద్వారమున నే జీవనదియగు 'పెన్యూసు' సముద్రమును ప్రవేశించుచున్నది. 'మగ్నీసి' యను వరుసయందలి మధ్యభాగమున 'పెలియన్' శిఖ రముగలదు. పిండసుపర్వతపు దక్షిణాంతమునుండి 'ఆథ్రిసు' పర్వతపజ్త్తి బయలుదేరి సముద్రమునఅకును వ్యాపించి థెస్స లీకి దక్షిణపుటెల్లగా నేర్పడియున్నది. మగ్నీసియను ఆథ్రిసు పజ్త్తుల చివరభాగములకు మధ్య'పగేసియను' ఖాడీచొచ్చుట వలన రెండుమైళ్ల యెడము నిలిచిపోయినది.

ఈ విధముగ నలుదిక్కుల కోటగోడలచేతంబడె రక్షిత మగు థెస్సలీమండలమున నిరువది ముప్పది చిన్నచిన్న పట్టణములుండెడివి. అవ్వానిచరిత్ర మనకంత బాగుగఁ దెలియదు. దక్షిణమున ఫార్సలను, ఫరేయును; పెన్యూసు నది పారుదలగల్గి మండలమునందెల్ల నుత్తమభాగమగు మధ్యప్రదేశముననుండు లారిస్సాయను పట్టణరాజంబును అందు ముఖ్యములు.

థెస్సలీ సారవంతమయిన దగుటచేత నచ్చట ధాన్యము పైరు చేయఁబడుచుండెను. కాని పంటపొలములకంటె పచ్చిక బయళ్లకే అదెక్కుడు ప్రఖ్యాతిగాంచెను. అచ్చటి

పశువులును పశువులకంటె గుఱ్ఱములును పేరువడసెను. గ్రీసునందలి తురగబలమంతయు నిచ్చటినుండియే వచ్చుచుండును.

పిండసు ఆథ్రిసు పర్వతముల కోణమునకు దక్షిణ భాగమున "టిఫ్రిస్టసు" అను పర్వతశాఖలు ఏమాత్రము క్రమము లేక వ్యాపించుచున్నవి. ఈ వంకర టింకరలగు భూధరములవలన పశ్చిమమున ఇటోలియా, అకర్నేనియా, మండలము లేర్పడుచున్నవి. అకిలసునది ఈ రెంటికిని మధ్య రేఖగ నొప్పుచుండును.

మధ్యగ్రీసు

రాళ్లప్రదేశమగుట నాగరకతయందు ఇటోలియా తక్కిన గ్రీకుమండలములకంటె నెప్పుడును రెండుమూఁడు శతాబ్దములు వెనుకనే యుండునని చెప్పవచ్చును.

ఇటోలియా

అకర్నేనియా అంత మెట్టప్రదేశమునుగాదు, అంత యధోగతి నుండునదియుంగాదు. ఇద్దాని తటరేఖయందు మంచిబందరులు పెక్కులు గానవచ్చుచున్నవి. అంబ్రేసియాఖాడీ ఇందు కుదాహరణము. ఈ ఖాడీయగ్రమున ఆర్గాసును దానికిఁ గొంచె ముత్తరమున 'అంబ్రేసియా'యును బూర్వమున ప్రసిద్ధి గాంచిన పట్టణములు. అకర్నేనియా తటరేఖకు గొంచెము దూరమున ద్వీపముల వరుసగలదు. అందు ల్యూకసు, ఇథాకా, సెఫల్లేనియా ముఖ్యములు. ఇథాకా లోకసం

అకర్నేనియా

చారియగు ఒడిస్సియసునకు జననభూమి. కారింతుఖాడీ ముఖద్వారమున కెదుటనుండు సెఫల్లేనియా వీనిలో నెల్ల గొప్పది.

టిఫ్రిస్టసు పక్తినుండి తూర్పునకుఁ బ్రాకు శాఖలలో రెండు క్రమముగ నున్నవి. 'ఈటా' శాఖ సముద్రతీరమునకు సమీపమున "మేలియ్యాను" ఖాడీకిని, 'యూబియా' జలసంధికిని సమానాంతరముగ వ్యాపించియున్నది. ఈ కొండల పార్శ్వములకును ఆథ్రిసు పర్వతములకును నడుమనుండు కొద్దిపాటి భూభాగము "స్పెరికియసు" నది ప్రవహించెడి యుపత్యకము. ఈ ఏటి పైభాగమును "ఏనియను" లను తెగవారును క్రిందిభాగమును 'మేలియను' లను తెగవారును ఆక్రమించికొనియుండిరి. మేలియనుల దేశభాగమునకు 'మేలిసు' అని పేరు. మేలిసుకుఁ దూర్పుభాగమునఁ బైఁజెప్పిన పర్వతశాఖలోని 'కల్లిడ్రోమస' ను నుపశాఖ నీటి దరినలకు వ్యాపించి సముద్రమునకును దనకును మధ్య నొక బండి పోవునంతటి స్థలముమాత్రము వదలుచున్నది. ఈ సందున కే 'థర్మాపొలి' కనుమ యనిపేరు.

థర్మాపొలి

ఇది గ్రీసుచరిత్రమున నే గాక లోకచరిత్రమునందంతయుఁ బేరుపడసియున్నది. ముందు తెలియనగును.

'థర్మాపొలి' దాటిన తరువాతఁ గొండలు తటరేఖకుఁ గొంచెము దూరమగుచున్నవి. వేలుపేర్లు వహించి వ్యా

లోక్రిసు

పించి 'యూబియా' ద్వీపములోని కాల్సిసు పట్టణమునకును ఇఱుకగు 'యురిపసు' జలసంధికిని ఎదుట ముగింపగుచున్నవి. ఈ కొండలకును 'యూబియను' జలసంధికిని మధ్య నిమిడిన భూభాగమే లోక్రిసు.

టిఫ్రిస్టసునుండి పూర్వభాగమున వ్యాపించు క్రమ శాఖలలో రెండవది మొత్తముమీఁద 'ఈటా' కొండలకు సమానాంతరముగలదై 'పర్నాసను' అనియు 'హెలికను' అనియు, 'సిథరను' అనియు క్రమముగా మొదట, నడుమన, కడపట పేళ్ళనందుచు కారిన్తు ఖాడీతీరమున వ్యాపించుచున్నది. ఇందు ముఖ్యతమమగు శిఖరము 'పర్నాసను' శిఖరమే. దీని దక్షిణభాగమందలి కోనలలో నొక దానియందు గ్రీకులచేఁ బ్రపంచమునకు మధ్యస్థానమని ఎన్నఁబడుచుండిన 'డెల్ఫి' యుండెను.

ఇచ్చట నొక చిత్రమగుగుహ గ్రీకుల ముఖ్యదేవతయగు 'అపోలో'కుఁ బ్రియావాసమగుటవలన దేశమందలి యుత్కృష్టతమమగు దేవాలయ మిద్దియెయై ప్రసిద్ధిగాంచి బహుకాలము భవిష్యత్తుం జెప్పు నెపంబునఁ దద్దేశీయుల సర్వకార్యములను నడిపించుచుండెను.

హెలికను గొండల పూర్వపార్శ్వముల నింపగు పచ్చందనము గన్నులకుఁ బొడగట్టుచున్నది. తోపులు దట్టముగఁగలవు. ఊటబుగ్గ లచ్చటచ్చట దృష్టిం దనుపుచుండును. కావుననే వీనిని గ్రీకులు సంగీతసాహిత్యాది కళలకు

నధిష్ఠానములగు దేవతల కిష్టమగు నెలవులని వాడుకొనుచుండిరి. సిధిరను కొండ లెంతో దూరము కారిన్తుఖాడీ ననుసరించుట లేదు. భూభాగము లోపలికిదూరి 'బియోషియా'కును 'అట్టికాకు'ను నడిమి యెల్లగా నేర్పడుచున్నవి.

ఈటా శాఖకును పర్నాసను, హెలికను, సిధిరను గొండలచేనగు శాఖకును మధ్యనుండు ప్రదేశము గ్రీసునందలి రెండవ బయలు. ఇది సుమారు ముప్పదిమైళ్ల పొడవును రెండు మొదలు పదిమైళ్ల వెడల్పును గలది. ఇందు రెండు నదులు ప్రవహించుచున్నవి—సెఫిసను, ఆసొపను. సెఫిసను ఈ బయలునందే గల కోపియను అను సరోవరమునఁబడుచున్నది. ఆసొపసు కారింతు ఖాడీలోఁ బోయి సంగమించుచున్నది. సెఫిససునది పారుదల పైభాగమున (అనఁగా ఈటా శాఖమూలమున) నాల్గుపల్లెలఁగల డోరియనులుందురు. అదియే డోరిసు;

డోరిసు

మధ్యభాగమున ఫోసియనులు నివసింతురు. వీరి పట్టణములు నదీతీరముల గుంపులుగుంపులుగ నుండెను. సారవంతమగు నీ ప్రదేశమేగాక కారింతుఖాడీవఱకుంగల పర్నాసను ప్రాంతములును వీరికిఁ జేరినవే. డెల్ఫిగూడ వీరిదియే యయియుండెను. ఇదెల్లయు ఫోసిసు అనఁ బరుగుచుండును.

ఫోసిసు

ఫోసిసునకును బియోషియాకును పొలిమేరయగు రేఖ రెండుమైళ్ల వైశాల్యముగూడఁ గలదిగాదు. బియోషియా

బియోషియా

యందుఁ బ్రథమ పట్టణమగు 'కెరొనియా' ఇచ్చటనే స్థాపితమగుట 'థర్మాపొలి'యుం బోలె నిదియును మధ్యగ్రీసునకు దుర్గద్వారంబై యనఁ దగును. ఈ ద్వారము గడవగనె బియోషియా బయలు గలదు. దీనికిఁ గొంతవఱకు సెఫిసస్సు, ముఖ్యముగ ఆసొపసు నీటి కాధరములు. ఈ మండలమునందును థెస్సలీ యందుబలె ననేక పట్టణములుండెడివి. ఈ పట్టణముల యైకమత్యము థెస్సలీ పట్టణముల కెప్పుడును రాలేదు. ఆర్కోమినసు, థీబ్సు అందుఁ బేర్కొనఁదగినవి.

సిథిరను పర్వతములును పార్నెసు పర్వతములును సముద్రమునుండి సముద్రమునకు అనగా కారిన్థుఖాడీనుండి ఎజీనా ఖాడీవఱకు వ్యాపించుచున్నవి. వీని పశ్చిమభాగమునుండి గెరెనియా యను కొండల సమూహము బయలుదేరుచున్నది. ఇది నానావిధములుగ వ్యాపించి కారిన్థు భూసంధిని మధ్య గ్రీసును విభాగించు నెల్ల యగుచున్నది. ఈ భాగమున నీ పర్వతముల చివరలకును సముద్రతీరములకును మధ్యప్రదేశము లొక్క బాటకైనను స్థలము చాలనంత ఇఱుకుగా నుండును.

అట్టికా మెగారిసులు

సిథిరను పార్నెసు పర్వతములకును పైనుదాహరించిన ఎల్లకును మధ్యంగల ప్రదేశమున, పశ్చిమ భాగమున మెగారిసు మండలమును, దూర్పున అట్టికామండలమును గలవు. ఈ రెం

డును విభజింపఁబడుటకు ముఖ్యకారణము రాజకీయ సంబంధమైన దేగాని ప్రకృతి సంబంధమగున దెద్దియు లేదు. సిథిరను పార్నెసు పర్వతముల పీఠమునుండి త్రికోణాకృతిఁగల ద్వీపకల్ప మొకటి ఏర్పడియున్నది. దీనికే 'అట్టికా' యని పేరు. దీన నిస్సారంబులును ఏటవాలులును అగు పీఠభూములు మెండు. ఇందు జలసమృద్ధి లేదు. కాని యనవరతనవీన వాయువుల వ్యాపనమువలన నచ్చటి వారికిఁ గొంత గష్టము దీరుచుండును. ఈ మండలమున రెండు సముద్రతీర భూభాగములు గలవు. వీని సారవత్త్వము ప్రకృతి పీఠభూముల యందలి లోపములఁ గప్పుచున్నది. ఆ రెండు నెవ్వియన పాశ్చాత్యకోణమున 'త్రయస్సియను' బయలును, ముఖ్య పట్టణమగు 'ఆథెన్సు' చుట్టుముట్టు నొక్క జీవనది పారుదల గల 'ఆథెన్సు బయలును'. ఈ మండలమె గ్రీకుల చరిత్రము నందు మిక్కిలి పేరుగాంచినది.

అట్టికా

లోక్రిసు, బియోషియా, అట్టికామండలములకుఁ దూర్పునఁ దటరేఖ కనతిదూరమున యూబియా యను గొప్ప దీవిగలదు. ఇది పై మండలములకును ఏజియను సముద్రమునకును మధ్య జలవేగ భంజకముగ నుపచరించుచున్నది. ఈ దీవికిఁ బునాది యొక గొప్ప పర్వతపఙ్త్తియే. యూబియా తూర్పు తటరేఖ ఒక్క బందరునకైనను ఎడమియ్యని యభేద్యంబగు

యూబియా ద్వీపము

నయశ్శిలా సమూహము. పశ్చిమతీరమున ననఁగా లోఁ బ్రదేశమునఁ గన్నుల పండువులగుఁ బచ్చని బయళ్లును మంచి బందరులును మెండుగఁ గలవు. అట్టి రంగములనె యధినివేశ స్థాపనమందు ప్రసిద్ధిగాంచి వ్యాపార స్థానం బులై పేరుగన్న కాల్సిసు ఇరిట్రియా పట్టణము లమరి యుండెను. కాల్సిసు పట్టణమునకును ఎదుటి ముఖ్యభూమికిని నడుమగల సముద్రశాఖ వెడలుపు నలుఁబదిగజములె. దీనికె 'యురిపసు' జలసంధి యని పేరు.

దక్షిణగ్రీసు పర్వతపఙ్త్తులకును దక్కిన పర్వతపఙ్త్తులకును సంబంధము గానరాదు. మధ్యగ్రీసును దక్షిణగ్రీసును

**దక్షిణగ్రీసు లేక పెలిపొన్నీసను**

గలిపెడు భూసంధ ఇఱుకగు చదురపు నేల ముక్కయని చెప్పవచ్చును. దక్షిణగ్రీసునందు పర్వత పఙ్త్తులలో మొదటిది యుత్తరమున నున్నది. ఈ వరుస కారింతుఖాడీకి దక్షిణభాగమున వైశాల్యము దక్కువగుఁ గొంచెము భూభాగమును వదలి తూర్పునుండి పడమటివఱకు వ్యాపించి యున్నది. దీని కొక్కెడ 'ఏరిమాన్తసు' అని పేరుగలదు. కాని ఉత్తర పెలిపొనీసను గొండలనిన మొత్తముగ నర్థముగాఁగలదు. దీని మధ్యభాగమునుండి వెలువడి సమకోణముగ నుత్తరదక్షిణములకు సూటిగ మెనిలసు, టెయిగటసు, అను పేళ్లతోఁ మరియొక పఙ్త్తి వ్యాపించియున్నది. టెయిగటసు దక్షిణభాగమే పెలిపొనీసునందలి దక్షిణతమమగు

ఔనారియము అగ్రము. మెనిలసు, ఔయిగటసు వరుసకు సుమారు పది పదునైదుమైళ్ల సమానాంతరముగ 'ప్తార్తి నియము' 'పార్నను' పఙ్క్తి యమరియున్నది. దీని దక్షిణపు చివరయే 'మేలియా' యాగ్రము. ఈ రెండు సమానాంతరపఙ్క్తులను అడ్డకొండలు మూఁడు స్థలములయందు కలిపివేయుటవలన సముద్రమునకు మార్గమే లేని ఫినియస్, స్టింఫలసు, మాంటినియా యను ఉచ్చ్రపత్యకము లేర్పడుచున్నవి.

కొరింతియా

దక్షిణగ్రీసునం దేఁడుభాగములు గలవు. కొరింతు భూసంధియు పొలిప్పనీసు పర్వతములు దాకువఱకును గల పరిసరభూములును కొరింతియా యనఁబడుచున్నది. భూసంధిపై నుండు కొరింతు, దానికిఁ గొన్నిమైళ్లు పశ్చిమమునఁగల 'సిసియను' దక్షిణమున గల ఫియ్లసు క్లియోనియాలు ఈ భూభాగమున నెన్నఁదగిన పట్టణములు.

ఆర్గొలిసు

ఫ్లియసు, క్లియోనియాలకు దక్షిణమున రెండు కొండగొమ్మలు ఒకటి తూర్పునకును ఒకటి దక్షిణమునకును వ్యాపించి ఆర్గొసు మండలముల నేర్పఱచుచున్నవి. ఇందు రెండుభాగములు. (1) తటరేఖకు గొంచెము లోవైపుననుండును ఆర్గొసు పట్టణముఁ జుట్టుంగల తెరభూమి (2) దీనికిఁ దూర్పున సముద్రము లోనికిం జివాలునఁ జొచ్చు ద్వీపకల్పము. ఇందు ఆర్గొసు

నుండి స్వతంత్రంబులై మిక్కిలి ప్రసిద్ధిగాంచిన మూఁడు పట్టణములు గలవు. ఎపిడారసు, ట్రోజెను, హెర్మియొనె. ఎపిడారసునుండి తీరమునకు గొంతదూరమున గ్రీసుదేశమునందెల్ల వర్తకవ్యాపారములకుఁ జాలకాలము పేరుగాంచిన ధీరులును సాహసులునునగు నొక జాతివారికి నివాసంబయిన ఎజీనాయను విషమద్వీపముగలదు.

ఆర్గాలిసునకు దక్షిణమున లకోనియా మండలమున్నది. పార్నను గొండలవలన నియ్యది రెండుగ విభజింపఁబడినది. తూర్పుభాగము గుట్టలతిట్టయై నివాసయోగ్యమే కాదు. పశ్చిమభాగము, అనఁగా పార్నను కెయిగటసులకు నడిమి భూమి యురోటసు నదీప్రదేశమై సస్యక్షేత్రములకును ద్రాక్షవనములకును నావాసమై యొప్పును. దీనినే హోమరుకవి 'లాసిడను పల్లము' అని వర్ణించియున్నాఁడు. ఇందే మహా ప్రసిద్ధిఁ జెందిన స్పార్టా పట్టణముగలదు.

లకోనియా

లకోనియానుండి కెయిగటసు పర్వతములచే వేఱు చేయఁబడు పెలిపొనీససుయొక్క నిరృతిమూలయే మెస్సీనియా. ఇందును లకోనియాయందుంబలె రెండుభాగములు గలవు. తీరభూమిపర్వతప్రాంతము. పామిససు నదీప్రదేశము గ్రీసునందేభాగమునను గానరాని వనవైభవము గలిగి 'అయనభూము'లఁ బెరుగు వృక్షములును ఫలించుఁ బండ్లును గొల్లలుగ నిచ్చు

మెస్సీనియా

చున్నది. మెస్సీనియా తటరేఖయందు పైలసు ఖాడీగలదు. అది పెలిపొనీసను యుద్ధమందును ఇటీవల నావరీనో సముద్రయుద్ధమునందును ప్రసిద్ధిగాంచినది.

నీడాయను చిన్ననది మెస్సీనియాకును దాని కుత్తరమునఁగల ఎలిసు మండలమునకును మధ్యరేఖ. (1) ఆర్కేడియా గుట్టలవలన నగు ట్రిఫ్లియా, (2) ఆల్ఫియసునది కుత్తరతీరమునందలి సస్యవంతమగు పైనాటిసు (3) ఎరిమిన్తసు పర్వతముల పడమటి ప్రక్కలవలననై పట్టణములనేమో యెఱుంగని గ్రామికులకాకరమై పశువులకును గొఱ్ఱెలకును బ్రసిద్ధి నొందిన ఎలిసు అను నీ మూఁడు భాగములును ఎలిసు మండలములోఁ జేరినవి. పైసాటిసునందు గొప్ప జాతీయ పుణ్యస్థానమగు ఒలింపియా కలదు. ట్రిఫ్లియాయందు దమదమ తెగలనుండి చీలిపోయినవారందఱువచ్చి చేరియుందురు. ఎలిసుప్రజలు వీరిని పైసాటిసు ప్రజలను నాదియందె జయించి తమకు లోఁబఱచుకొనిరి. ఎలిసుసీమయందలి పశ్చిమతమాగ్రమునకు పంద్రెండుమైళ్లదూరమున జకింతసు అను పెద్ద ద్వీపము గలదు.

ఎలిసు

ఉత్తర పెలిపొనీససుపర్వతములు కారింతుఖాడీకి దక్షిణమున నెంతో వెడలుపులేని భూభాగమును ఆర్కేడియానుండి వేఱుసేయుచున్నవని వ్రాయఁబడియె. ఆ భూభాగమునకె ఆకియా అని

ఆకియా

పేరు. పర్వతముల యడ్డగొమ్ము లనేకములు సముద్రపు టొడ్డునకు వ్యాపించుటవలన నీ యాకియా యసంఖ్యాతం బగు చిన్న చిన్న తీరపు మైదానముల కూడిక యని చెప్ప నొప్పును. ఈ మైదానములకు నీటిమార్గములె సుఖతర ములు. ఇట్టి బయలుల పట్టణము లేర్పడి నైకమత్యముతో సాంఘికభావమున మెలఁగి గ్రీసునందలి యితర పట్టణముల వలె నంతర్యుద్ధముల పొంతఁబోక ప్రవర్తించుచుండెను.

ఆర్కేడియా

ఇఁక వర్ణింపవలసిన మండలము ఆర్కేడియా యొక్క టియు. ఇది పెలిప్పొనీసునందలి మధ్యభూమి. దీనికిని సముద్రమునకును సంబంధము లేదు. పర్వ తములు దీనిని రెండు ముఖ్యభాగములుగఁ జీల్చుచున్నవి. పూర్వార్థము ఇదివఱకే వర్ణింపఁబడిన ఫిని యను స్టింఫలను, మాంటినియా యను ఉచ్చోపత్యక ములచే నావరింపఁబడియున్నది. ఈ మూఁడవదానియందు బరస్పరబద్ధవైరమూని గ్రీకుచరిత్రకాలమునందెల్లయు నంత ర్యుద్ధములు సేయుచుండిన 'మాంటినియా' 'టెగియా' లను పట్టణములు గలవు. పశ్చిమార్థము ఇల్ఫియసు ఉప నదుల ప్రాంతములగు నుపత్యకములచే నిండియున్నది. ఇయ్యుచ్చభూమియందు వటవ్యాక్రాంతములగు గుట్టలు ముఖ్యాంగములు. ఇట్లగుట నిట నైకమత్యములేని చిన్న చిన్న తెగలనేకములు వసించుచుండెను. ఇయ్యవి యొకదాని యెడ నొకటి ఈర్ష్యఁ గనుపఱచుచు నెప్పుడును వేఱుపడి

యుండునవి. స్వస్వాతంత్ర్యమునందే దృష్టి గలుగుటంజేసి మీరా తెగ లెప్పుడును జేరుటకు వీలులేకుండెను. కావున నీ ప్రదేశపు జనులు గ్రీకులందఱిలో ననాగరకులయి దారిద్ర్యమునకు నునికిపట్టయిరి. కావుననే ప్రథమమునుండి యిచ్చటి ప్రజలు ఇతర దేశములకుఁ బోయి పరరాజ్యసైన్యములఁ జేరి పొట్టఁబోసికొన నేగుచుండిరి.

ద్వీపములు

గ్రీసునకుఁ బూర్వ దిగ్భాగమున దరతరంబులుగ నేజి యను సముద్రము నాక్రమించుకొని ద్వీపములు గన్పట్టును. ఒకదానినుండి మఱియొకదానికి ప్రయాణము చేయుచు వరుసక్రమముగ నాసియాఖండ ముఖ్యభూమిం జేరవచ్చుననిన నీ దీవుల సంఖ్య బోధపడగలదు. ఇవి రెండు సమూహములుగ నేర్పడియున్నవి. సైక్లడీసు అనియు స్పోరడీసు అనియుఁ బేర్లు. ఇందులో డీలాసు అను ద్వీపము జ్ఞాపకముంచుకొనఁ దగినది. డెల్ఫీకి రెండవపుణ్యస్థానము గ్రీసున నిద్దియె యై ప్రసిద్ధికెక్కెను.

క్రీటు

ఏజియను సముద్రపు దక్షిణ ముఖమున కడ్డముగ 'క్రీటు' అను పొడవగు ద్వీప మొండుగలదు. అందు ననోన్యమైత్రిలేని యనేక పట్టణము లుండెను.

# రెండవ ప్రకరణము

## గ్రీసునందలి మొదటి నివాసస్థులు

ఏజియనులు

క్రీస్తుశకమునకు రెండుమూఁడు వేల సంవత్సరములకు మున్ను మనము గ్రీసని వాడుకొను దేశమునందును ఆ చుట్టుముట్టునుగల భూభాగమునను నొక జాతి జనులు నివసించుచుండిరి. వారి భాష యెట్టిదో మనకుఁ దెలియదు. కాని వా రొకవిధమగు లిపి నుపయోగించి వ్రాయుచుండిరి. అది మన కింకను జదువుకొన సాధనము లేర్పడలేదు. లోకములో నితర జాతులవారివలె వీరును దమలోఁ దాము యుద్ధములాడుచుండిరి. వారి యాయుధములు రాతితోడను రాగితోడను జేయఁబడినవి. ఇనుమంత విశేషము వాడుకలో నుండునది గాదు. బయటిదేశమునుండి ఇనుము దెచ్చుకొనినను ఆ దేశమున నది యరుదగుటవలన మనము బంగారమును సేకరించినట్లు సేకరించి పెట్టుకొనుచుండెడివారు. అప్పటివారికిఁ గుమ్మరిసారెయు దాని యుపయోగంబునుఁగూడఁ దెలియదు. మృద్ఘటములు చేతనఁ జేసికొనుచుందురు. శిల్పమునందును వారికి పరిచయము లేదు. రాతిపై రాతి నెక్కించి సందుల

చిల్లరరాళ్లఁ దోపి గోడ లేర్పఱచుకొని ఇండ్లు గట్టుకొనుచుం దురు. ఇట్టివారగు నా జనులపేరు మనకుఁ దెలియనందున వారు ఏజియను సముద్రప్రాంతముల నివసించుచుండిరిగాన వారిని ఏజియనుజాతివారనుచున్నాము.

సంవత్సరములు గడచె; తరములు గతించె; శతాబ్దములు పొరలిపోయె; పట్టణములు పుట్టె. వృద్ధినొందె. నశించె. ఏజియనులు క్రమక్రమమున ననుభవములందిరి. మార్పులు జెందిరి. ధనమును శక్తిసామర్థ్యములను సంపాదించిరి. ఈజిప్టు మున్నగు దేశములకెల్లఁ బోయి వాని వైచిత్ర్యంబులఁ బొడఁగాంచిరి. రాగి తగరముల మేళవించి కంచు నుత్పత్తి సేయ నెఱింగికొని తమ యాయుధంబులు దానన చేయఁ బ్రారంభించిరి. కుమ్మరిసారెయందు నానావిధములగుఁ బాత్రములఁ ద్రిప్పి వానిపై నలంకారార్థము చిత్తరువుల లిఖింపఁజొచ్చిరి. అందు మనుష్యాకృతులును జెక్కఁబడి యున్నవి. ఇయ్యవి మన కంటికిఁ గొంచెము విపరీతముగఁ గనుపించును. కాని వీనివలన నక్కాలమున జను లేస్థితి యందుండిరో, ఏ రీతి యుడుపులు ధరించిరో, ఏపగిది యాభరణంబులఁ దీర్చిరో, ఏవిధమగు యుద్ధోపకరణంబుల నుపయోగించిరో, మున్నగు సంగతులు గొంతవఱకుఁ దేట పడఁగలవు. వీరు గుట్టల పైభాగముల బలమగుఁ గోటలఁ గట్టి వాని చుట్టును ప్రాకారములు నిర్మించిరి. ఇవ్వాని యందు శిథిలములై నిలిచిన కొన్ని ఖండము లింకను దూర్పు

గ్రీసున గాననగుచున్నవి. ట్రాయినగరముపై దండయాత్రకు వెడలిన అగమమ్నాను మహారాజు రాజధానియైన మైసీనియాలోఁ గల పురాతన ప్రపంచ శేషము లత్యుత్తమములు. ఏజియను రాజుల నగరులు మిక్కిలి విశాలములై శిల్పికాచాతుర్యమును గనుపఱచుచుండును. కుడ్యములపై శోభాయమానంబులగు చిత్తరువులు గన్నులపండు వొనర్చుచుండెడిని. పచనశాలయు భోజనాగారములు రెండు నొక్కటియె. తన్మధ్యమున గోళాకారంబును విపులంబును నగు నగ్నిగుండముండును. నానావిధవర్ణములచేత నలంకరింపఁబడిన నీ శాలయందాహూయమానులైన యతిథులందఱకు స్వాగతమిచ్చి ప్రభువులు వారిని సత్కరించుచుందురు. వెండి బంగారములీ దొరల బొక్కసముల దాండవమాడుచుండెనని చెప్పనొప్పును. వీరు యుద్ధమునకుఁ దరలుతఱి రెండశ్వములు పూన్చినయరదము నుపయోగించుచుండిరి. వీరి భటులు ధనుఃఖడ్గభల్లహస్తులై గొప్ప యజినశిరస్త్రాణములు ధరించి కంఠమునుండి పాదమువఱకు వ్యాపించు డాలులచేఁగప్పఁబడి వీరి వెంబడి నడచుచుందురు. వీరు మృతినొందినచోఁ గళేబరము సమాధి సేయఁబడుచుండెను. పురుషుఁడైనచో నాయుధములు దోడన పూడువఁబడుచుండెడివి. స్త్రీయైన నమూల్యాభరణములు నిక్షిప్తములగుచుండె. సమాధిపై కట్టడములకు మిక్కిలి వెలగల చలువరాళ్లె యుపయోగింపఁబడినట్టు తెలియుచున్నది. వీరు పృథివి, సముద్రము, ఆకా

శము, సూర్యుఁడు మున్నగుఁ బ్రకృతిశక్తులను జిత్రించి యుండుటవలన వీరి కవ్యానియందు భక్తిగలిగి వానిని బూజించుచుండిరని చెప్పినను జెప్పవచ్చును. మున్మున్ను వీరింత నాగరకత గలవారుగ నుండలేదని నుడువంబడియె. వీరు నావికాయాత్రలయందును విశేషము శ్రద్ధవహించినట్లు గానిపింపదు. వీరి పల్లెలును పట్టణములును సముద్రతీరము నుండి కొంత దూరమున సంరక్షణ కనుకూలమగు పట్టులఁ గట్టఁబడియున్నవి. కావున వీరు నావికా చోరులవలనఁ గొంత భయ మందుచుండిరని యూహింపఁదగును. అయిన వీరి కింత నాగరకత యబ్బుటకుఁ గారణమేమియో నుడువఁ దగియున్నది. గ్రీకుదేశచరిత్రమునందు మన మెఱింగిన మొట్టమొదటి చరిత్రాంశంబైనఁ దటస్థించుటకుఁ బూర్వమే ఏజియన్ సముద్రప్రాంతముల వర్తకమంతయు ఫొసీషియనులను పౌరవాత్యుల స్వాధీనమైయుండెను. వీరు వ్యాపారపరాయణులై యప్పటికి సభ్యరాష్ట్రములలో నగ్రగణ్యములగు నీజిప్టు మున్నగు దేశములతో రాకపోకలు సలుపుచుఁ దత్తద్దేశీయులకంటె నెక్కుడు నాగరికులైయుండిరి. వీరు ఏజియనులతో విస్తారము వర్తకసంబంధములు గల్పించుకొని ఏజియను సముద్రతీరముల నచ్చటచ్చట దమ యుపయోగార్థమయి రేవులను గడించి వర్తకగృహములు నిర్మించిరనుటకు నిదర్శనములు గలవు. ప్రప్రథమమున వీరి సంపర్కమువలన నేజియనులు నాగరకత నంది వీరి యుద్యమ

ములనెల్లఁ గ్రమక్రమముగఁ దమ జీవితములఁ బ్రతిబింబింపఁ జేయుచుఁ దుట్టతుదకు వీరిని ఏజియను తొడివర్తకము నుండి తొలఁగించి నట్లగుపడుచున్నది. ఇవ్విధమున నేజియను లారంభ దశయందు ఫొనీషియనుల మూలమునను దరువాత స్వయముగను సభ్యత్వమున కర్హులయినట్లు నిర్ణయింపఁదగియున్నది.

ఆర్యులు

క్రమముగ సైన్యములును దదర్థమై నిరంతర పరిశ్రమయు వృద్ధిగాంచని ప్రాచీనకాలములఁ గొన్ని సంఘములయందు సభ్యత్వ మధికముగఁ గొలఁది జనులు యుద్ధమునందు వలయు ధైర్య స్థైర్య కాఠిన్యాదిగుణంబులను మెల్ల మెల్లగఁ గోల్పోవుటఁ గలదు. కావుననె వారు దమపై దండెత్తివచ్చు దక్కున నాగరకము గల జాతులకు లోఁబడి వారితో గలసిపోదురు. ఏజియనులకు నీ యవస్థయే తటస్థించెను. ఆర్యులు దమ మూల ప్రదేశమును వదలి దినదిన ప్రవర్ధమానమగుచుండిన దమ జాతికి యునికిపట్లు వెదకికొనుచు వెడల నారంభించిరి. వీరి మూలప్రదేశ మిట్టిదని నిర్ధారణముగఁ జెప్పుటకు వీలులేకున్నది. కొందఱు మధ్యాసియా యనియును మఱిఁ గొందఱు మధ్యైరోపా యనియు నభిప్రాయపడియున్నారు. ఏది ఎట్లయినను వీరొక్క జాతివారై యొక్క మూల ప్రదేశమునుండి వ్యాపించి శాఖలై కాలక్రమమున నాసియా యైరోపాల నాక్రమించుకొనిరను విషయమున మా

త్రము భిన్నాభిప్రాయములు లేవు. ఐరోపాఖండమునకు దరలిన శాఖలలో హెల్లనులను శాఖవారు గ్రీసుదేశమున కుత్తరభాగమునుండి ప్రవేశించిరి. ఈ శాఖలవారెల్లరు నొక్కటేతటి నొక్క సంఘముగఁ బ్రవేశించిరని చెప్పుటొప్పదు. ఆక్రమించిన స్థలములు దమ పెరుగుటవలన సంకుచితములగుచుండఁగ కొంచెము కొంచెముగ వీరు క్రొత్త సీమలఁ జొచ్చుచుందురు. ఇట్లు చిన్న చిన్న గుంపులుగ గ్రీసుదేశమునకు రా నారంభించిన యార్యులు ప్రారంభమున స్వదేశీయులతోఁ బోరాడి జయించి తరువాత వారితో స్నేహము చేసికొనుచువచ్చిరి. వీరు ముఖ్యముగ పశుపాలకులును వ్యవసాయదారులును నై యంత నాగరకత లేనివారగుటచేత నేజియనుల నాగరకతాభివృద్ధికిఁ దొలుదొల్తఁ గొంచె మాటంకము గలుగఁజేసినవారైరి. కాని రాను రాను ఏజియనులకును హెల్లనార్యులకును స్నేహము బలిసి సంబంధ బాంధవ్యములుగూడ కుదిరెను. ఈ బాంధవ్యములవలననైన ప్రజలే మన చరిత్రయందలి గ్రీకులని గ్రహింపవలయును.

గ్రీకులు

దండయాత్రలు ముగిసి యీ మార్పు లేర్పడుటకు బహుకాలము పట్టియుండును. ఆర్యులు ప్రవేశించుకొలఁది త్రొక్కుడువడి యనార్యులు కొందఱైనను ఇతర ప్రాంతములకు, అనఁగా తూర్పున నాసియాఖండమునకో పశ్చిమమున నైరోపాయందలి యితర ప్రదేశములకో, యేగి

యుందురు. ఈవిధమున మనచే గ్రీకులని పిలువంబడు జాతి వారు* గ్రీసులో స్థాపనము నందులోపల నేజియను సముద్రమున కీవలను నావలను ననేకమగు మార్పులు గలిగెను.

గ్రీకుల పురాతన చరిత్ర మనకు బాగుగఁ దెలియదు. వారును దమ పూర్వికులను గుఱించి మనకంటె నెక్కుఁ డెఱుంగరు. కాని సర్వదాబలాఢ్యంబగు మహోద్ధీశక్తిగల వారగుటచేత వారు దమకు సిద్ధాంతముగఁ దెలియని యంశములు సమన్వయింపఁ జేయుటకయి కథ లల్లుట కెప్పుడును వెనుదీసియుండలేదు. తమ నామధేయంబును సంతతిని నీ క్రింది విధమున సమర్థించుచున్నారు. పూర్వమున డ్యుకలియనను రాజొకఁడు గలఁడు. అతని రాజ్యమున ప్రజ లతిదుర్మార్గులై పోరాని పోకలఁ బోవుచుండిరి. దేవతాశ్రేష్ఠుండగు జ్యూసు మిక్కిలి యోర్పుతో వారి ప్రవర్తనమును గనిపెట్టియుండెను. అయిన వారేమాత్రమును సంస్కారము నందుట గానుపింపదయ్యె. కావున నా దివిజేంద్రునకు భరింపరాని యాగ్రహము పుట్టి యా ప్రజ నెల్ల నశింపఁజేయ నిశ్చయించెను.

థెస్సలి మండలముపై పిడుగని జడివాన గురియవలసినదని మేఘబృందముల కాజ్ఞ యిడె. ఆ దేశమంతయు

---

* వీరెప్పుడును దాము "హెల్లెనులనియే" చెప్పుకొందురు. రోమకులు వీరికిఁ బెట్టిన గ్రీకునామము పారంపర్యముగ వచ్చుటవలన నదియే స్థిరమైనది.

జలమున కాహుతియై పోయె. డ్యూకులియనును అతని కళత్రంబగు పిర్హాయును నొక్క దేవనావ నిర్మించుకొని అందు వసించుటఁబట్టి వినాశమును దప్పించుకొనఁగలిగిరి. తొమ్మిది రోజు లా నావపైఁ దేలుచుండి తుదకు పర్నాసను శిఖరమున గట్టుఁజేరిరి. అచ్చట జలంబు లణఁగునటకునుండి తాము దప్పఁ దక్కటి ప్రజ యెల్ల నిర్మూలమగుటకు మిక్కిలి వగచి యా దేశము నెప్పటి యట్ల సజనం బొనర్పుమని జ్యూసును ప్రార్థించుచు వేల్చిరి. జ్యూసును దయార్ద్రహృదయుండయి తన దూతయగు హెర్మీసును బంపెను. డ్యూకులియను పిర్హాలు రాళ్లనెత్తి తమ భుజములపైనుండి వెనుకకు విసరవలసినదని యతఁ డాజ్ఞనొసంగెను. వారును నట్లే చేయ డ్యూకులియను విసరిన వెల్లయుఁ బురుషులుగను పిర్హా విసరిన వెల్ల స్త్రీలుగను బరిణమించెను. ఇవ్విధమున నవీనంబగు నీ జాతి యుద్భవించె. డ్యూకులియనునకు హెల్లెనను కుమారుఁడు గలిగె. అతఁ డీ శిలాజాతజాతిపై ప్రభుత్వమూని నందున వారికి హెల్లెనులను పేరు వచ్చెను. హెల్లెనుకు 'ఇయొలసు' 'డోరిసు' 'క్సూతసు' అను పుత్రు లుదయించిరి. 'క్సూతసు'నకు 'అయొను' 'అకియను'లు పుట్టిరి. వీరినుండియె గ్రీకు లందుగల 'ఇయోలియనులు' 'డోరియనులు' 'అయోనియనులు' 'అకియనులు' అను నాలుగు శాఖలవారును నేర్పడిరి. ఇదియె గ్రీకు లనాదిగ వాడుకొనెడి యుత్పత్తి కథనము.

పురాతన నిర్మాణములఁ గాంచుటవలనను పారంపర్య ముగఁ బాడఁబడుచుండిన స్తోత్రపాఠములు వినుటవలనను

గ్రీసు పురాణ పురుషులు

దమకు బూర్వమున నుండినవారు దమకంటె నెక్కుడాజానుబాహులనియు, నెక్కుడు బలవంతులనియు నెక్కుడు ధీమంతుల నియు దైవపురుషులనియు గ్రీకు లూహింపఁజొచ్చిరి. ప్రాత కాలపు కథల నన్నిఁటిని సమన్వయము చేసి కల్పనాశక్తి నుప యోగించి నూతనవిషయములఁ జొప్పించి యత్యద్భుతం బును నమానుషంబునగు సాహసకార్యము లొనర్చిన ధీరు లను, దమ నివాసంబగు 'ఒలింపసు' శిఖరమునుండి యవ తరించి వారితోఁ జేరి నడచు దేవతలను వర్ణింప మొదలిడిరి. ఇట్లు వర్ణితులగు ధీరులను గ్రీకులు పురాణపురుషులుగ నెన్ను చుండిరి. అందు గొందఱు దైవజ్ఞులు ఘోరాకారులును గ్రూ రులును నగు రాక్షసులతోఁ బోరాడి వారిం బరిమార్చుచుం దురు. మఱికొందఱు లోకాపకారకారణంబులగు మృగా దుల దునుమాడుచుందురు. వేఱొకకొందఱు విచిత్రంబు లును నసామాన్యములును నగు వివిధకార్యముల సాధిం చుచుందురు. హెరాక్లీసు అను ధీరుఁడు పంౘ్రెండు సాహస కార్యము లొనర్చి మరణానంతరము దేవత్వము నందెనట. థీసస నతఁడు వృషభాసురు నొక్కనిఁ జెండాడి యమరుఁ డయ్యెనఁట. పరస్యూసు అనునతఁ డొక రక్కసి నుక్క

డించి దివిజులఁ జేరెనట. ఇప్పుగిది గ్రీకుల పురాణముల నెందఱో పురుషుల కథలఁ జదువవచ్చును.

ఇవ్వానియందెల్ల లోకప్రసిద్ధి గాంచినది 'ట్రాయి' కథ. ఇద్దానిని హోమరను గ్రీకు కవిపుంగవుఁ డత్యద్భుత రచనా కౌశల్యముచే నొక కావ్యమున నిమిడ్చి తన కాలమునందలి గ్రీకుల యభ్యాసవేషభాషాచారవిశేషంబుల లోకంబునకు నెల్లఁ దేటతెల్లంబుగ వెల్లడిసేయుచున్నాఁడు. కవి, ప్రపంచమునందలి ప్రసిద్ధకవులలో నొక్కడుగఁ బేరువడసి యుండుటంజేసి యాతని కావ్యాంతర్గతంబగు నీ కథ యింత ప్రాముఖ్యతం జెందియున్నది. ఈ కవికాలము నిశ్చితము గా లేదుగాని యితఁడు క్రీస్తుశకమునకు తొమ్మిదివందల సంవత్సరములకు ముందు జీవించియుండెనని చెప్పవచ్చును. ఇతఁడు వృద్ధదశయందు నంధుఁడు గూడనైయుండెనట. మిక్కిలి బీదవాఁడగుట బిచ్చమెత్తికొనుచుఁ దిరుగుచుండెడువాఁడనియుఁ జెప్పుదురు. కొందఱు హోమరను కవియే యుండలేదనియు నీ ట్రాయికథ యనేక కథలను జేర్చి తరువాతివా రెవరో వ్రాసిరనియు నభిప్రాయపడియున్నారు. ఈ యంశమును జర్చించుట మన కనవసరము. కవి ఎవ్వరైనను లోకమున మిక్కిలి యద్భుతమగు గావ్యములలో నొక్కటిని మన కొసంగినాఁడనుటకు సందియము లేదు. ట్రాయి యుద్ధమును మనకు వర్ణించు కావ్యమునకు ఇలియడు అని పేరు. దేవత

ట్రాయి కథ

లును మానవులును నీ యుద్ధమున పాత్రములగుచున్నారు. గ్రీకులును ట్రోజనులును నత్యద్భుతములును నమానుషంబులును నగు ననుభవంబులకు లోనగుట ప్రదర్శింపఁబడుచున్నది. ఇట్లే కథయందు విపరీతాంశము లనేకములుఁ జేర్పఁబడియున్నను దీనికి మూలాధారము చారిత్రక విషయము లేయని మనకు నిస్సందేహముగఁ దెలియవచ్చియున్నది.

ట్రాయి బయల్పడిన విధము

ట్రాయి కథయందు మిక్కిలి యాదరముగల డాక్టరు స్లీమను అను శార్మణ్య (జర్మేనియా) పండితుఁడొక్కఁడు సుమారు ముప్పదిసంవత్సరములకు మున్ను, చిన్నఆసియా (ఆసియా మైనరు) నందు ట్రాయినగరపునిలువ యెచ్చటనైనఁ గాననగునేమోయను ప్రయత్నమున నచ్చటికిఁ బ్రయాణమై పోయెను. 'ఇలియడు'నందు వ్రాయఁబడిన వర్ణనల నన్నిఁటిని బహుజాగరూకతతోఁ జదివి 'డార్డనల్సు' నకు దక్షిణభాగమందలి సముద్రతీరమును పరీక్షింపఁ జొచ్చెను. సముద్రమునకు మూఁడుమైళ్లదూరమున నొక గుట్టపై శిథిలంబయి యుండిన పురాతన పట్టణం బొకటిం గనియె. దానిపైఁ గొంత యూహచేసి ఖననకార్యంబుల నడిపించెను. త్రొవ్వం ద్రొవ్వ వెంబడి వెంబడిగ నేడు పట్టణంబులొక్కటిక్రింద నొక్కటి బయల్పడెను. ఇందితరములకంటె నెక్కుడు విరివిగలదియు నెక్కుడు ప్రాముఖ్యతం గాంచినదియుంబోలెఁ జూపట్టిన పట్టణ మగ్నిప్రీతి యయ్యెనని

యచ్చటి చిహ్నములవలన విశదపడియెను. తాను హోమరువ్రాసిన కావ్యమున ట్రాయి హుతాశనున కాహుతి యొనర్పంబడెనని చదివినవాఁడగుటం బట్టియు, వర్ణనాంశములవలన ప్రదేశమును జక్కఁగ నెఱిఁగినవాఁ డగుటం జేసియు, డాక్టరు స్లీమను ఈ చిహ్నములవలన నిద్దియె ట్రాయియగునని గుర్తించి పూనికతో నా ప్రదేశ మంతయుఁ బరిశీలింప మొదలిడెను. అట్లు వెదకుటలో రజతసువర్ణపాత్రములును, విలువగల గిన్నెలును, కంచుచేఁ జేయంబడిన యాయుధములును దొరకెను. మఱియు ననేక విషయములు రానురాను బయలుపడుటవలన హోమరు కావ్యమునందు వర్ణితములగు నంశములును ప్రదేశములును పెక్కులు మనకు విశదమయినవి.

సంగ్రహముగ ట్రాయికథ యిట్లు. గ్రీకు దేశమున నారీరత్నములలో నెల్ల, సౌందర్యమునకు బ్రసిద్ధిగాంచిన 'హెలెన' ను నామె యొకర్తుగలదు. వరు లనేకు లామెకొఱకై యాశించుచుండిరి. వారలలో నేరిని ఏరుటకును దన కసాధ్యమయినందున హెలెను తండ్రి స్వయంవరము చాటఁబంపెను. రాజపుత్రులును, రాజులును, ప్రభువులును దమ తమ యంతస్థున కుచితమగు రీతిని విచ్చేసిరి. వారల నెల్లరం సభఁజేర్చి హెలెను తండ్రి విజ్ఞాపనము చేసుకొనియెను. అది యేమన, హెలెను గోరుకొను వరునిపై విఫలమనోరథులగు నితర

ట్రాయికథ

రులు దౌర్జన్యము సూపఁగూడదనియు, నంతియగాక యతని కెప్పు డేరివలననైనను పత్నీవిషయమున నాపద సంభవించిన గ్రీకు ప్రభువులందఱును ఆతనికి సాహాయ్యము పడవలయు ననియు. ఆ ప్రార్థన నెల్ల రంగీకరించినతరువాత స్వయంవరమహోత్సవము నడచెను. హెలను స్పార్టాకు రాజగు మినీలానును జెట్టవట్టెను. ఆగతులైన ప్రజయంతయు వివాహానంతరము దమ దమ స్థానంబుల కేగిరి. బహుకాలము హెలెను మినీలాసులు సుఖముగ దాంపత్యము సలిపిరి.

అంత. చిన్నఆసియాయందు ట్రాయియను పట్టణమునకు నధీశుండగు 'ప్రయము' అను నతనికి నేబది గురు పుత్రులు. అందు 'పారిసు' అనువాఁడొక్కఁడుండును. అతఁడు హెలెను రూపలావణ్యాతిశయంబులఁ బలుమరు వినుటచే నామెయందు మోహముగలవాఁడయి స్పార్టాకు బ్రయాణముచేసి, అట హెలెనుయొక్క యనుగ్రహము వడసి, యామెను దన పట్టణమునకు లేవనెత్తికొనిపోయెను. ఇట్లు మ్రుచ్చిలిన దుర్మార్గుని దండించుటకై యాతని ప్రోలుపై దాడివెడల నిశ్చయించితిమనియు దదర్థము దమ వాగ్దానము చొప్పున గ్రీకుప్రభువులెల్లరును మినీలసుకు సాయ మొనర్ప సైన్యములతో వచ్చి చేరవలసినదనియు నాతని యన్నయగు "అగమెమ్నూ"నను మైసీనియా మహారాజు వార్తఁ బంపెను. గ్రీసుదేశమున నొక్క రాజ్యమును నొక్క రాజును గాదనియుఁ, బ్రతిపట్టణంబును దన తన

స్వాతంత్ర్యము నెప్పుడును గాపాడుకొన ప్రయత్నించుచుండె ననియు నిదివరకుఁ జెప్పఁబడినది. ఈ పట్టణములన్నియు నొక్క సంఘముగ నేర్పడుట గ్రీసుచరిత్రము నంతయు పరిశోధించిన నొకటి రెండు సమయముల నుండునేమో. అందు ట్రాయి యుద్ధమునకై 'ఆగమెమ్నను' ఆధిపత్యము క్రిందఁజేరుట మొదటి తరుణము. అప్పుడు సైన్యములు గ్రీసు దేశపు దశదిశలనుండియుఁ గొంచెమేనియు నలిగొలి లేక వచ్చి, బియోషియాయందు 'ఔలిసు' అను పట్టణము కడ ప్రోవయ్యెను. వేయికి పైఁబడి యుద్ధనావలును లక్షకు నెక్కుడగు యోధులును నా సైన్యసముద్రము నలంకరించి రని చెప్పఁబడియున్నది. ఇం దర్ధబలము గ్రీసుచే నంపబడి యుండినను నయ్యది హోమరువంటి మహాకవికి వర్ణనాంశ మగుట కర్హత గలదియె.

ఈ యుద్ధమునకు సన్నద్ధుఁడైన ప్రతిప్రభువును దన తన సైన్యభాగమును నడపుచు, ఆగమెమ్నను దండనాయకత్వమునకు లోఁబడి ప్రవర్తించెను. ప్రారంభించుటతోడనే గ్రీకులు ట్రాయిపట్టణమును ముట్టడింపలేదు. వీరు తమ బలము ముఖ్యముగ నావికాబలంబె యగుటవలన ట్రాయి ప్రాంతమున యుద్ధనావల లంగరువైచి, తత్తీరంబుననె దండు విడియించి, యచ్చటినుండి మాటి మాటికి ట్రాయిపట్టణముం దాకిరి. ట్రోజనుల (అనగా ట్రాయిరాజుల) బలంబును గొంచెమయినదిగాదు. నానావనీశులు వారికిఁ దో

డ్పడ నేతెంచిరి. శౌర్యాటోపసమేతులును నద్భుతఖడ్గ విద్యానిపుణులును నగు నుత్తమ వీరు లిరువాగులను గలరు. ఒక్కొక్కరి చరిత్రమును వివరించుట కిది యదనుగాదు. అందు ముఖ్యులగువారిం గొందఱమాత్రము పేర్కొనియె దము. గ్రీకులపక్షమున 'అకిల్లీసు' అనువాఁడు ప్రతాప మర్తాండుఁడు. అతఁడు ముందునడువక ట్రాయి పట్టువడ దని గ్రీకుజ్యోతిష్కులు వక్కాణించియుండిరి. అతని జాత కమున 'వీఁ డనియందు ననన్యసామాన్యంబగు బలపరా క్రమంబులు సూపి శాశ్వతకీర్తినంది యౌవ్వనమునందు మృ త్యువు వాతంబడు. లేదేని పనికిమాలిన తుచ్ఛఁపుబ్రతుకు బహుకాలము దన దేశంబున గడపు'నని వ్రాయంబడి యుండెను. ఆకిల్లీసు ఘనకుటింబీకు లెల్లరంబలె నాచంద్ర తారార్కంబగుఁ గీర్తియె వరించుచుండె. కాని యాతని తల్లి మాత్ర మద్దాని కంగీకరింపక తన ముద్దులపట్టికి కన్య వేషము నమర్చి "స్కైక్రసురాజు" జనానాయందుంప వేడికొనియె. అచ్చటనైనఁ దన పుత్రరత్నము నెవ్వరును గుర్తింపలేరని యా మె తలంచెనుగాని మిక్కిలి యుక్తిశాలియగు "ఒడిసియస్సు" అను ఇతాకారాజు అకిల్లీసు నానవాలుపట్టి యెప్పుడెప్పు డని వేచియుండిన యా వీరుని యుద్ధమునకుఁ బురి కొల్పెను. అకిల్లీసు ట్రాయితోఁ జేరిన పట్టణముల ననేకముల దన స్వల్పసంఖ్యగల వీరవర్గము సాహాయ్యంబున ముట్టడించి స్వాధీనము చేసికొనియెను. ఇట్లు యుద్ధము తొమ్మిది సంవత్స

రములు జరిగిన తరువాతఁ బదియవయేట అకిల్లీసు ఆగమె మ్ననులకు వివాదము గలిగి, అకిల్లీసు శస్త్రముల సన్యసించి పటకుటీరంబునఁ గూర్చొనియెను. ఆ సమయమున ట్రోజనులలో మిక్కిలి శూరుండగు "హెక్టరు" గ్రీకుల పలుమారు పరాజితుల జేసెను. ఒక్కతరి వీరిని పెద్ద యుద్ధమున నెదిర్చియోడించి వీరిఁ బడవలవరకును దరిమె. యుద్ధనావలు నశించిన గ్రీకులు నశింతురను నిశ్చయమున ట్రోజను లవ్వానిం గాల్పఁ బ్రయత్నించిరి. మొదటి కలంబునుండి జ్వాలలు 'నిగుడుటతోడనె అకిల్లీసు పశ్చాత్తాపము నొంది తన ప్రాణమిత్రుఁడగు "పట్రోకలసు" కుదనకవచము దొడగుట కిచ్చి యుద్ధమునకుఁ బురిగొల్పి పంపెను. అతఁడును మహాతేజమున వెలువడి ట్రోజనులను యుద్ధనావల వద్దనుండి పలాయితులఁజేసి ట్రాయి ముఖద్వారమువరకు వారిని వెన్నంటి తరిమెను. అచ్చట రెండుసైన్యములకును జరిగిన పోరాటమున విజయుఁడయ్యెను పట్రోకలసు, హెక్టరు ఖడ్గముదెబ్బచే నిహతుఁడయ్యెను. ఈ వార్త వినుట తోడనే అకిల్లీసు పాదతాడితభుజంగమ మోనా లేచి నూతన కవచముం ధరించి దివ్యాస్త్రంబుల సంధించి వీరరసభరితంబగు హృదయంబుతోఁ దన ప్రియస్నేహితుని మరణంబునకుఁ దీవ్రప్రతీకారం బొనర్పఁ బయలువెడలెను. ప్రళయకాలపవనుండరుగుదేర నిలువలేక తారుమారై దుల్లిపడు వస్తుసముదాయము భంగి, అకిల్లీసు ధాటికి తాళఁజాలక

ట్రోజనుల సైన్యమంతయుఁ జెల్లాచెదరై పటాపంచలై విరిగిచనియె. ఈ పగిది పరబలంబులఁ జూర్ణప్రాయముగ నొనర్చుచు ట్రాయిప్రాకారంబుండగ్గరి హెక్టరు నెదిర్చి క్రోధజ్వాలలే మూర్తీభవించినవోయన వ్యాపించు దన ఖడ్గదీధితుల దృష్టిం గప్పియొక్క పెట్టున నాతనిఁ గూలనేసె.

హెక్టరు మరణముతో హోమరు కావ్యము ముగియుచున్నది. తరువాతి కవులు వివిధవిషయములను జేర్చి హెలెనుమినీలసుల పునస్సమాగమమును వర్ణించియున్నారు.

హోమరు కృతియందు మన కాహ్లాదమొసఁగునది కావ్య చమత్కృతి మాత్రమెగాదు. గ్రీకులు హోమరు యుగమునందు ఎట్టి సాంఘిక నిబంధనలుగలవారై యే పగిది లోకయాత్ర నడుపుచుండిరనుట మనకుఁ బ్రదర్శించి హోమరు వినాశరహితమగుఁ గీర్తి వడసియున్నాఁడు.

హోమరు కాలమందలి గ్రీసునకును చారిత్రకప్రథమ యుగమందలి గ్రీసునకును మిక్కిలి తారతమ్యము గనుపించుచున్నది. గ్రీకుచరిత్రయందు ముఖ్యతమములగు 'డోరియను' 'అయోనియను' లను గొప్ప తెగలు హోమరునందుఁ గొంచెమైనను పేర్కొనఁబడి యుండలేదు. డోరియనులు థెస్సలీయందే మూలకో పేరు ప్రసిద్ధులులేక నివసించుచుండెడివారు. అప్పుడు సుప్రసిద్ధులగు వారు పెలిప్పొనీసు లేక దక్షిణగ్రీసు నాక్రమించుకొని వ్యాపించియుండిన 'అకియను' తెగవారు. ఆ యుగమున గ్రీకులకును ఇతరులకును నంత

భేదము పాటింపఁబడుచుండుట లేదు. హోమరు గొందర నాగరిక జాతులను, అనార్యభాషాపుత్రులను వర్ణించియు న్నాఁడు. అయినను గ్రీకులను ట్రోజనులను వేషభాషా చారంబుల నొక్క సమంబుగ నెన్నుటవలన భేదభావ మప్ప టికిఁ బుట్టలేదనియె నిశ్చయింపవలసియున్నది. గ్రీకుల కానాటికి 'హెలెను'లను జాతీయనామ మేర్పడలేదు. విశే షముగ "ఆకియను" తెగకుఁ జేరినవారగుటవలన 'ఆకియను' లనియును, ఆర్గాసు రాజ్యమునకు లోఁబడిన వారగుటవలన ఆర్గైవులనియు, ఆర్గైవు పదమునకుఁ బర్యాయపదంబగు 'డానను'లనియు వీరిని హోమరు పిలుచుచున్నాఁడు. కావున జాత్యైక్యము జాత్యభిమానంబును పరజాతి నిగ ర్హణంబును గ్రీకులయందుఁ గ్రమక్రమముగా వృద్ధిపొందెనే కాని హోమరు కాలమున కానరావని చెప్పఁదగియున్నది.

హోమరు యుగమున గ్రీకు రాష్ట్రములు రాజుల పరి పాలనయందుండెడివి. సింహాసనము రాజసంతతివారిపలన పారంపర్యముగా నాక్రమింపఁబడుచుండెడిదే కాని, కొన్ని సందర్భములఁ బ్రజలకుఁ దీర్మానముసేయు నధికారముఁ గలదు. శక్తివిహీనుండని తోఁచినచోఁ బుట్టుకవలన గద్దెకు నర్హుండగువానినిగూడఁ ద్రోచిపుచ్చుటకును యుద్ధము నందు రాష్ట్రసైన్యంబు నడపి శౌర్యము సూపగల వీరుఁడగు మరియొకనిని నిర్వచించుటకును వారు హక్కుదారులు. అక్కాలమున రాజే దండనాథుఁడు. హోమరు వర్ణనల

యందంతయు రాజు మహాశూరుఁడై తన శౌర్యమువలననే రాజపీఠము నధిష్ఠించునట్లు స్పష్టమగుచున్నది. యుద్ధము లెల్లయు నిట్టిరాజు లొక్కరొక్కరుగ సాహసించి యొనర్చుచు వచ్చిన ధీరకార్యములని చెప్పనొప్పును. వీరు రథారూఢులై ఘోరమగు ద్వంద్వయుద్ధములఁ జేసి జయాపజయంబులఁ గొనుచుందురు. వీరిని వెన్నంటి నడచు కాల్బలముల పోరాటము ముఖ్యము. రాజు సేనానిమాత్రముగాదు; మహామతాచార్యుండును, ఉన్నతన్యాయాధిపతియుఁగూడ నైయుండు. దేవాలయములయం దితరాచార్యు లేర్పడియుండిరి కాని రాజు రాష్ట్రమునకై దేవతల నారాధించి హోమములు సేసి వేల్చుచుండును. మనుష్యుఁడు నియమించిన చట్టము లెవ్వియు నప్పటికి లేవు. దేవతాజ్యేష్ఠుండగు జ్యూసు మొదలయే మొదల. అనగా స్వాభావికమగు న్యాయాన్యాయ వివేచనయే సూత్రము. అట్టి సూత్రము ననుసరించి బజారు నడిరంగమున రాజు వ్యాయోగంబులను విని తీర్పులిచ్చుచుండును. తరువాతి కాలమునఁ బౌరవాత్యరాజుల యెడఁ గాననగు నాడంబరము లెవ్వియు లేక హోమరు రాజులు సర్వసాధారణముగ దేహయాత్ర నడుపుచుండిరి. ఇంతియెగాదు. వారి యధికారముగూడ నిరంకుశముగాదు. వారికి రాజకీయవిషయములను న్యాయవిచారణవిషయంబులను సలహా యొసగుటకుఁ గొందఱు ప్రభువు లేర్పడియుందురు. వీరి సభకే ప్రభువుల సభయనియు గ్రీకుభాష

యందు 'బ్యూ లే' యనియుఁ బేరు. ఆగమెమ్నను మహారాజు గారి ప్రభువుల సభయం దితరరాజు లెల్లరును సభ్యులు. మూఁడవ యధికారి ప్రజాసభ. బజారు నడురంగమున, (లేక గ్రీకుల "అగోరా" యందు) రాష్ట్రపుఁ బ్రజయంతయుఁ బ్రోగయి రాజుగారు వాక్రుచ్చిన ప్రతి యంశమునకును 'ఔను" 'కాదను' నంగీకారతిరస్కారసూచకశబ్దంబులతోఁ బ్రత్యుత్తర మిచ్చుచుందురు. ఇంతకంటె నీ సభకెక్కు డధికారము లేదు.

హోమరు యుగమందలి గ్రీకులయందు క్రౌర్యౌ దార్యములు చిత్రరీతిని మేళవమందియుండెను. మానవుని జీవన మతిచులకనగ నెన్నఁబడుచుండుటవలన యుద్ధమున విజయమందినవారు పరాజితసైనికుల మిక్కిలి యవమాన పఱచుటయు, నీచంబును గర్హణీయంబునునగు నవస్థల నిడు టయుఁ, బట్టువడిన పట్టణములయందలి పౌరుల నడుగంటు జంపుటయు, లేనిచో బానిసల నొనర్చుటయు సంభవించు చుండెడిది. నావికాచౌర్యము గౌరవనీయంబుగనుండె. ఇంతవిపరీతంబగు మనఃకాఠిన్యము చూపట్టుచున్నను నీ గ్రీకులయం దాతిథ్యధర్మము బహుజాగరూకతతోఁ గాపా డఁబడుచుండెను. ఏ దేశీయుఁడైనను సరియె. ఎట్టివాఁడైన నగుఁగాక. ఆతిథ్యము వేడెనేని వీ రాతని మనోభీష్టము దీర్ప కుండుట లేదు. అతిథులును సభ్యాగతులును దేవోత్తముం డగు జ్యూసు రక్షణయందుండువారగుట వారిని సంహరిం

చుట మహాఘముగఁ బరిగణింపఁబడుచుండును. ఇంతకంటె నెక్కుడు పాపమగునది బంధుహత్య. సందర్భముల నను సరించి బంధుహంత క్షమాపణార్హుఁడే యగునప్పుడుగూడఁ బ్రవాసప్రాయశ్చిత్తము లైనను విధించుటమాత్రముదప్పదు.

హోమరునందు వర్ణితములగు భార్యాభర్తల యనురాగంబును దల్లిదండ్రుల ప్రేమయు బిడ్డల విశ్వాస విధేయతలును నేమాత్రము మన కాలమునకుఁ దీసిపోలేదు. అప్పటి గ్రీకుల జీవితమాడంబరమేమియు లేక సర్వసాధారణముగఁ గడపఁబడుచుండెను. పురుషులు వ్యవసాయము సేయుటయందో రాజకీయకార్యములు నిర్వహించుట యందో శ్రమచేయుచుండ స్త్రీలిండ్లపట్టున గృహకార్యముల నెరవేర్చుచు, వడకుట, నేయుట, మున్నగుఁ జేతిపనులందును దమ కౌశల్యము సూపుచుందురు. ఇంటి యజమానురాలు రాణియైనను నగుఁగాక. తన నౌకరులతోఁ గలసి మెలసి వారొనర్చు సర్వకార్యముల స్వయముగ గమనించి యాయా తరుణంబుల వలయు నుత్తరువుల నిచ్చుచుండును. సాయంకాలమగుటయు దన పనినెల్లఁ దీర్చుకొని భర్తతోడ భోజనాదుల కాయత్తపడును.

నివేశములయందును క్షేత్రములమీఁదనుగల పని విశేషభాగము దాసులె నెరవేర్చుచుందురు. వీరు ముఖ్యముగ యుద్ధమునందుఁ బట్టువడిన ఖయిదీలును సముద్రము మీఁద నావికాచోరుల వాతఁబడి పరదేశములయం దమ్మఁ

బడిన దురదృష్టులును. అయిన వీరి సంఖ్య హోమరు యుగమునందు స్వల్పము. కూలికై పనిచేయువారి ననే కుల గ్రీకులు నియమించుకొనియుందురు. బానిసలయెడలఁ గూడ గ్రీకుయజమానులు దయానురాగములు గనుపఱచు చుండిరనుటకు పెక్కులు నిదర్శనములు గలవు. దాసులును దమ యజమానులకు వినయవిధేయతలు గలవారై మెలఁగుచుండిరి. అక్కాలమున నాణ్యములు లేవు. పశువులే సర్వవ్యాపారములయందును వెలకుఁ బరిమాణముగ నుపయోగింపఁబడుచుండును. గోగణంబులును ఇతర జీవముల మందలును వర్ణించుటయే రాజులయుఁ బ్రభువులయు నైశ్వర్యమును వక్కాణించుట.

హోమరుకుఁ దెలిసిన ప్రపంచము మిక్కిలి చిన్నది. గ్రీసును జుట్టుముట్టుం గల ఏజియను ప్రాంతములును నతఁడు చక్కగ వర్ణించియున్నాఁడు. గ్రీసు పశ్చిమతటంబైన నతనికిఁ బూర్ణముగ మనోగతమైనట్లు కానరాదు. ఇఁక దూరదేశములను గుఱించి వ్రాయుటలో నీతఁడు సూపిన విజ్ఞానమును జర్చించు టనవసరము. ఊహ నిచ్చవచ్చినపగిది విడిచి యద్భుతంబులగు విచిత్రములన్నియు లిఖించినాఁడనినఁ జాలును.

## మూఁడవ ప్రకరణము

## గ్రీకుల జాతీయబంధములు

గ్రీసు దేశచరిత్రముఁ జదువునపు డిదివరలో వ్రాయఁబడిన విధమున గ్రీసునం దొక్క రాష్ట్రముగాక యనేకరాష్ట్రములుండెననుసందర్భము జ్ఞాపకముంచుకొనవలయును. ఆ దేశమందలి పట్టణరాష్ట్రములన్నియు అమెరికాయందలి సంయుక్తరాష్ట్రంబునందుఁబలె సంయోగమున నిబద్ధమయినవిగూడ కావు. సంయోగమునందుండినయెడల నధ్యక్షుఁడును, పరిపాలనాసభయు, సైన్యాదులును నన్నిఁటికి సామాన్యముగ నుండుటవలన నొక్క విధమగు నైక్యముండును. ఇట్టి బంధము లేకున్నను గ్రీకు లెల్లరును నేకజాతీయులేయై యుండిరి. కారణము వారెల్లరచే నమోఘంబుగ నెన్నఁబడుచు వచ్చిన బంధనేతరములు.

అందు మొదటిది వారి భాష. ఆంధ్రదేశమునందంతటను మన మాంధ్రభాష మాట్లాడుకొను తెఱంగున హెల్లెను లెల్లరు గ్రీకుభాషయే యుపయోగించుచుందురు.

భాష

గోదావరి తెలుఁగునకును నెల్లూరు తెలుఁగునకును, నెల్లూరు తెలుఁగునకును చిత్తూరు

తెలుఁగునకును, చిత్తూరు తెలుఁగునకును కర్నూలు తెలుఁగునకు నెట్లు స్వల్పభేదములు గానుపించుచున్నవో యట్లే గ్రీసు దేశమందును ప్రదేశము ననుసరించి భాష యందు కొద్దిపాటి భేదములుండెడివి. కాని మన కెట్లు స్వల్ప భేదములు ఆంధ్రులమను నభిమానమును గదల్పజాలవో అట్లే గ్రీసు దేశస్థులకును గ్రీకులను నభిమానమును దగ్గింప లేకుండెను. బ్రిటిషు దీవులయందును, బ్రిటిషు ప్రజల వలన నేర్పడిన యధిని వేశముల (colonies)* యందును, అమెరికాయందలి సంయుక్తరాష్ట్రమందును, నింగ్లీషే భాషయగుటంబట్టి యెన్ని సముద్రము లెన్ని పర్వతము లెన్ని దేశములు వేరు సేయుచున్నను ఆ భాష నుపయోగించు ప్రజలెల్లరకును స్నేహభావము గలుగుచున్నది. విస్తీర్ణమందుఁ గొంచెమయిన గ్రీసునందో, యెల్లరును మిక్కిలి సమీపస్థులై మాటిమాటికి రాకపోకలు సలుపు ప్రజ. ఇంతియేకాక గ్రీకుభాష శ్రావ్యమై యన్ని కార్యములకుఁ జాలియుండినందున గ్రీసు దేశస్థు లితరభాషల నేరువ నుద్యమించుటయు లేదు. అనేకభాషల నభ్యసించి వేఱు వేఱు భాషల నుపయోగించు జనంబుల కైక్యభావము శీఘ్రముగఁ గుదురుటరుదుగాని ఏకభాషోపయోగుల కట్టి భావ మరుదుగాదు. కావుననే గ్రీసుజను లనాదినుండి తాము 'హెల్లెను'లనియుఁ

* వేఱు దేశములలో నేర్పఱచికొనిన నివాసభూములకు అధిని వేశములని పేరు.

నమ దేశము 'హెల్లాసు' అనియుఁ, దమ భాష 'హెల్లనీసు' అనియు వాడుకొనుచున్నారు.

రెండవ బంధము గ్రీసుదేశీయుల సామాన్యసంతతి. అచ్చటచ్చటఁ గొంచెము సంకరమయియున్నను హెల్లెను

సంతతి

లెల్లరును దాము హెల్లను సంతతిలోఁ బారంపర్యముగఁ బుట్టినవారలే యని నమ్ముటవలన నది యైక్యమునకుఁ బ్రబల సాహాయ్యమయ్యెను.

మూఁడవదియు బలవత్తమమునునగు బంధము గ్రీకుల కెల్లరకును సామాన్యమగు మతము. దేవతల తండ్రియు

మతము

మానవుల చక్రవర్తియు నగు జ్యూసు గ్రీసు దేశమున సర్వాధికారి. డోడోనా, ఒలింపియా దేవాలయముల యందీతని నారాధించి యితని యనుగ్రహము వేడు గ్రీకుదేశీయులకీ యాధ్యాత్మికబంధమునకంటె నే భౌతికబంధం బెక్కుడుగాఁగలదు. పూర్ణ తేజస్స్వరూపుఁడును సర్వోత్తముండును నగుట జ్యూసు భౌతిక వాతావరణమునకు దూరుండుగనుండి మనుష్యమాత్రులతో సంబంధములు గలుగఁ జేసికొనుట లేదు. అతని పుత్రుఁ డగు 'అపోలో' ఒలింపసు ప్రభువగు నాతనికిని గ్రీకులకును మధ్యవర్తియై వీరెంతవర కెఱుంగనగునో నంతమాత్రము భవిష్యత్తుం బ్రదర్శించుచుండును. కావున నితఁడు గ్రీకుల దేశములందెల్ల భవిష్యత్కథనంబునకు గురుండని పేరువడసి

జ్యూసునకు రెండవవాడుగ నర్చన లందుచుండును. ప్రతి పట్టణమునందును నెందరో దేవతల కునికిపట్టులగు నెన్ని యో సుందరభవనము లుండెడివి. అందును దత్తత్పట్టణాధి దేవత ప్రాముఖ్యత నొందుచుండును. కాని ఏ దేవతయు నే పట్టణాధదేవతయు నీ యపొల్లోను బోలినవారుకారు. ఈతని మందిరంబులకు మూలమూలలనుండి భక్తు లేతెం తురు. పరమాత్మునితో మానవులు స్వయముగ నెదుటఁబడి సంభాషింపలేకున్నను, దేవతలమూలముగనైనను సంజ్ఞలవల నైనను నతని యభిప్రాయముల నెఱుంగ నగునని గ్రీకులు నమ్మెడివారు. కావున నపోల్లోకును జ్యూసునకును బ్రియ ములగు బుణ్యక్షేత్రముల దర్శింపని హెల్లెనుడుండడని చెప్ప నొప్పును. ఆసియా ఖండమునందలి నగరములనుండియు జనులు గుంపులుగుంపులుగఁ దీర్ఘయాత్ర వెడలివచ్చి యీ యాలయముల జ్యూసుమనంబుం దెలిసికొని పోవుచుండురు. ఉత్తమ దేవాలయములలో నొకటి రెంటి నిట వర్ణించెదము.

ఎలిసు మండలమందలి ఒలింపియాలో జ్యూసున కర్పి తమగు దేవాలయ మొక్కండుగలదు. దానియందాతని విగ్రహములు బంగరుచేతను దంతముచేతనుచేసి యుంచఁ బడినవి. ఒక్క చేత విజయంబును సంకేతించు ప్రతిమను మఱియొకచేతఁ జక్రవర్తి చిహ్నమగు దండంబునుధరించి సింహాసనముపైఁ గూర్చొని యుండుట ప్రదర్శింపఁబడి నది. ఈ ప్రతిమలఁదీర్చిన 'ఫిడియసు' అను రచనా ధురం

ధరుఁడు క్రీ. పూ. ఐదవశతాబ్దమునఁ దాఁ జేసిన పని కామోదించి తను కృతార్థుం జేయవలసినదని జ్యూసును వేడగా నతఁడు దనకు ప్రియమగు గుర్తగుటవలన నొక్క యశని నా విగ్రహముల చెంతపడవైచి భక్తునకుఁ దన మనస్సంతోషమును వెల్లడిచేసెనట. ఈ దేవాలయమున దేవుని యనుగ్రహమును, దతర్థ మియ్యబడు బలిస్వరూపమును బట్టి యాచార్యులు నిర్ణయించుచుందురు. వీరు బలి యొసంగఁబడిన జీవమునందలి లో భాగముల నెల్ల మిక్కిలి జాగరూకతతోఁ బరీక్షింతురు. వేల్చుతరి నగ్నిజ్వాలలరీతిం గమనింతురు. కాలవిశేషంబుల గుర్తింతురు. ఇవ్వాని నన్నిటిం బరిశీలించి భగవంతుని యర్థమును భక్తులకు విప్పిచెప్పుదురు.

ఎపిరసునందలి పురాతనంబగు డోడోనా దేవాలయంబున వృక్షముల మూల్గుటలును, పావురేళ్లకూతలును, ఇత్తడి పాత్రముల మ్రోగుడులును నీశ్వరుని యాజ్ఞ నెఱుంగఁజేయు సాధనములు.

భవిష్యత్కథనమునకు నపోలో గురుండని వ్రాయఁబడియెంగదా! కావుననే తదర్థమేర్పడిన దేవాలయములన్నియు నతనిచేత నధిష్ఠింపఁబడుచుండెను. అట్టి వానిలో ముఖ్యతమమగునది డెల్ఫీక్షేత్రము. పర్నాసస పర్వతమునందలి యొక సుందరమయిన చరియనుండి మూఁడు బుగ్గలొక్కెడ గుప్పున బయలుదేరుచున్నవి. ఆ ప్రదేశమున నపోలోఁ దనకుఁ బ్రియతమంబగు నివాసముగ

నేర్పఱచుకొనియెను. తత్పూర్వమచ్చట 'గేయే'యను దేవతకుఁ బట్టగు నాలయముండెనట. ఆ దేవతను జ్యూసును అతనితోడివారలును పదభ్రష్టుని జేసిరట. ప్రకాశమానములును కఱకులునునగుఁ జిప్పలును నగ్నిజ్వాలలఁబోలు నాలుకలును గల గండభేరుండొకడు దానిని గాచుచుండు. వానిఁ బరిమార్పక జ్యూసున కచట భవనము నిర్మించుకొనఁ గాదు. కావున నపోలో త్రిరాత్రము లవ్వానితోఁ బోరి వానిం బరిమార్చి సంతోషమున నొక్కగీతమును బాడెను. గ్రీకులు జయ మందునెడల నంతయు నద్దానినే పాడుచుందురు. అపోలోగండభేరుండముల యుద్ధరంగమునకుఁ బ్రక్కన నొక పర్వతపుఁ జీలికగలదు. దానినుండి యెడతెగక దట్టమగు పొగలు పైకి లేచుచుండును. ఈ భాగము గర్భగుడియం దిముడు విధమున నాలయము గట్టఁబడియున్నది. అందపోలోవిగ్రహమును, దేవదారుపుడకలింధనముగ ననారతము వెలుగుచుండు నగ్నిగుండమును నుండును. దీనికి సమీపమున నొక గోళాకారమగు రాయి స్థాపితమయియుండును. జ్యూసు రెండుభరద్వాజముల భూమియొక్క రెండుచివరలనుండి యనిపెననియు, నవి వచ్చి యీ రాతియెడఁ జేరుటవలన నద్దియె ప్రపంచమునకు మధ్యస్థానమనియు గ్రీకులు నమ్ముచుందురు. ఆలయమునందలి లోకప్పున నపోలోకుఁ బ్రియంబగు 'లారెలు'* లాక్ర

* ఇది యొక వృక్షవిశేషము.

మించియుండెడివి. బహిఃప్రదేశములు సొంపగుఁ జిత్రవిగ్ర హములచేతను, దేవతల సాహసకార్యములం దెలుపు చెక్కు టపు పనులచేతను నిండియుండును. దేవుని యనుగ్రహము వడయఁ గోరువారు గొంతసంస్కారము లేక యాలయము ప్రవేశింపఁగూడదు. నిర్ణీతదివసమున నొక్కయాచార్య, ధూమము లెగయుచుండు నా పర్వతబిలంబుపైని తన ముక్కాలుపీటమీఁద నాసీనయగును. క్రిందినుండి పైకెక్కి వచ్చు నావిరులఁ బీల్చుటవలన భ్రమజెంది శివమెత్తిన ట్లయి పోయి యామె నోటికివచ్చిన గూఢపదముల నుచ్చరించును. పార్శ్వమున నిలువంబడు పురోహితు లావాక్యముల బాగుగ గమనించి భగవంతుని యనుజ్ఞలఁ బద్యరూపముగ భక్తులకుఁ దెలియఁ జేయుచుందురు. ఇట్లు దేవుఁడిచ్చు ప్రత్యుత్తర ములు గొన్నివేళల నగమ్యగోచరములుగ నుండును. ఈశ్వ రుఁడు దన మనంబును మానవునకు విప్పిచెప్పడనియు, నంతి యగాక భక్తుఁడు దన భక్తికొలఁది యెఱుంగఁగలఁడేగాని గాఢభక్తిలేనిది వరంబులఁ బడయునా యనియుఁ, దర్కించు కొని గ్రీకులు భగవంతుని సేవకులిచ్చు నర్థవాక్యులను సమ ర్థించుకొనుచుందురు. దుష్టబుద్ధులు ప్రశ్నించినచో వారి వినాశంబున కగు నుత్తరములు దేవదేవుం డిచ్చుననియు గ్రీకులు విశ్వసింతురు. భవిషత్కథనమును గుఱించిన చిత్రమగు నుదాహరణము లొకకొన్ని వర్ణనీయములు.

'క్రీససు' అను రాజు లిడియాదేశమును బరిపాలించు చుండెను. అతఁడు పారసీకదేశముపై దండెత్తిపోవ నుద్యమించి జయాపజయముల మున్ముందే తెలిసికొనఁ గోరి డెల్ఫీ దేవాలయమునకుఁ దన పరిజనంబుల ననిపెను. వారికి డెల్ఫీ భవిష్యత్ప్రదర్శని "మీ రాజు లిడియా పారసీకములకు మధ్యరేఖయగు హాలిసునదిం దరించెనేని యొక గొప్పరాజ్యము గూలిపోవు" నని ప్రత్యుత్తర మొసంగెను. క్రీస సద్దానికిఁ బొంగి, కూలునది పారసీకరాజ్యముగదా యని తలఁచి, జంకులేక సైన్యముల నడపించుకొని, నదిందాటి పారసీకమును జొచ్చెను. కాని యతనికి నపజయముపై నపజయమే తటస్థించి తుట్టతుద కతఁడే పట్టువడియెను. అతని రాజ్యము గూలిపోయె. ఈ పగిది డెల్ఫీభవిష్యత్ప్రదర్శిని నుడివినది సత్యమాయెను. కాని క్రీససు మాత్రము దప్పఁ దలఁచె. కూలు గొప్పరాజ్యము దన దగుట నతం డెఱుఁగ లేఁ డయ్యెను.

భవిష్యత్ప్రదర్శనుల శక్తిని గనిపెట్టవలెనని యదే క్రీససుకుఁ దోఁచెను. అందులకై యీతఁడు దన భటులనెల్ల దేవాలయములకుఁ బంప నిశ్చయించి వారిని బిలచి "మీరలు మేము దండయాత్ర వెడలిన తరువాతఁ దొంబది తొమ్మిది దినములు గడపి నూరవనాఁడు మీకు నియతమగు నాలయంబున కేగి నేడు క్రీససేమి సేయుచున్నాఁడని

యడుగవలసిన"దని యాజ్ఞాపించెను. డెల్ఫీ యిచ్చిన ప్రత్యుత్తరమిదిగో.

ఇసుమునందలి కణముల నెన్నఁగలదు
సంద్రములమేరలం జక్కఁ జదువఁ గలదు
మూగివారల భావముల్ లాగఁ గలదు
మౌనధారుల గీతము లానగలదు.
ఇట్టి బెడిదంపు నా బుద్ధి కిప్డు దోఁచె
కూర్మ మొక్కటి ప్రక్కన గొఱ్ఱె యొకటి
వండంబడుచుండె నిత్తడి కుండయందు
ననియు మాతయు నిత్తడియనియు మఱియు.

క్రీసను ఏరికిని సామాన్యమును మనోగోచరంబును గాఁజాలని పని జేయఁ దలంచి యా సమయమున నొక్క గొఱ్ఱెపిల్లను నొక్క తాఁబేటిని యిత్తడిపాత్రమునందు వండించుచుండెను. అట్లగుట డెల్ఫీ దేవాలయమునఁ బురోహితుఁడు నుడివిన పై వాక్యములు దప్పనివే యయ్యెను.

ఈ చిత్రము జరిగిన కొంత కాలమునకు దరువాత పారసీకులు గ్రీసు దేశముపై దాడి వెడలి వచ్చిరి. అప్పుడు ఆథెన్సు ప్రాముఖ్యత నందియుండెను. కావున ఆ అథీనియనులు గ్రీసునంతయును జేర్చి శత్రువుల నెదుర్చువారైరి. వారు దాము సేయవలసిన కార్యమేమని డెల్ఫీచక్రవర్తి నడిగిరి. దానికిఁ బ్రత్యుత్తరము "మీరు మీ మ్రాకుగోడల విశ్వశింపుఁడని" యపోలో సేవకులు చెప్పిరి. కొంద ఱిద్దాని

‘క్రీససు’ అను రాజు లిడియాదేశమును బరిపాలించు చుండెను. అతఁడు పారసీకదేశముపై దండెత్తిపోవ నుద్యమించి జయాపజయముల మున్ముందే తెలిసికొనఁ గోరి డెల్ఫీ దేవాలయమునకుఁ దన పరిజనంబుల ననిపెను. వారికి డెల్ఫీ భవిష్యత్ప్రదర్శని “మీ రాజు లిడియా పారసీకములకు మధ్యరేఖయగు హాలిసునదిం దరించెనేని యొక గొప్పరాజ్యము గూలిపోవు” నని ప్రత్యుత్తర మొసంగెను. క్రీసస ద్దానికిఁ బొంగి, కూలునది పారసీకరాజ్యముగదా యని తలఁచి, జంకులేక సైన్యముల నడపించుకొని, నదిందాటి పారసీకమును జొచ్చెను. కాని యతనికి నపజయముపై నపజయమే తటస్థించి తుట్టతుద కతఁడే పట్టువడియెను. అతని రాజ్యము గూలిపోయె. ఈ పగిది డెల్ఫీభవిష్యత్ప్రదర్శిని నుడివినది సత్యమాయెను. కాని క్రీససు మాత్రము దప్పుఁ దలఁచె. కూలు గొప్పరాజ్యము దన దగుట నతం డెఱుఁగ లేఁ డయ్యెను.

భవిష్యత్ప్రదర్శనుల శక్తిని గనిపెట్టవలెనని యదే క్రీససుకుఁ దోచెను. అందులకై యాతఁడు దన భటులనెల్ల దేవాలయములకుఁ బంప నిశ్చయించి వారిని బిలచి “మీరలు మేము దండయాత్ర వెడలిన తరువాతఁ దొంబది తొమ్మిది దినములు గడపి నూరవనాఁడు మీకు నియతమగు నాలయంబున కేగి నేడు క్రీససేమి సేయుచున్నాఁడని

యడుగవలసిన"దని యాజ్ఞాపించెను. డెల్ఫీ యిచ్చిన ప్రత్యుత్తరమిదిగో.

ఇసుమునందలి కణముల నెన్నఁగలదు
సంద్రములమేరలం జక్కఁ జదువఁ గలదు
మూఁగివారల భావముల్ లాగఁ గలదు
మౌనధారుల గీతము లానగలదు.
ఇట్టి బెడిదంపు నా బుద్ధి కిప్డు దోఁచె
కూర్మ మొక్కటి ప్రక్కన గొఱ్ఱె యొకటి
వండంబడుచుండె నిత్తడి కుండయందు
ననియు మాతయు నిత్తడియనియు మఱియు.

క్రీసను ఏరికిని సామాన్యమును మనోగోచరంబును గాఁజాలని పని జేయఁ దలంచి యా సమయమున నొక్క గొఱ్ఱెపిల్లను నొక్క తాఁబేటిని యిత్తడిపాత్రమునందు వండించుచుండెను. అట్లగుట డెల్ఫీదేవాలయమునఁ బురోహితుఁడు నుడివిన పై వాక్యములు దప్పనివే యయ్యెను.

ఈ చిత్రము జరిగిన కొంత కాలమునకు దరువాత పారసీకులు గ్రీసుదేశముపై దాడి వెడలి వచ్చిరి. అప్పుడు ఆథెన్సు ప్రాముఖ్యత నందియుండెను. కావున ఆ అధీనియనులు గ్రీసునంతయును జేర్చి శత్రువుల నెదుర్చువారైరి. వారు దాము సేయవలసిన కార్యమేమని డెల్ఫీచక్రవర్తి నడిగిరి. దానికిఁ బ్రత్యుత్తరము "మీరు మీ ప్రాకుగోడల విశ్వశింపుఁడని" యపోలో సేవకులు చెప్పిరి. కొంద ఱిద్దాని

భావమును గ్రహింపలేకున్నను మఱికొందఱు దమ సహజ చాతుర్యమువలన నియ్యది తమ పడవలపై యాధారపడుఁ డని తెలుపుచున్నదని గుర్తించిరి. వెంటనే యోడల నెక్కి భార్యాపుత్రులతోఁ గూడ గ్రీకులు 'సాలమిసు' ద్వీపముం జేరి యక్కడ పారసీకులతో నావికాయుద్ధ మొనర్చి వారిని పలాయితులఁ జేసిరి. ఇట్లు గ్రీకులు సులభముగ నర్థము చేసికొనలేకున్నను భగవంతుని యనుజ్ఞమాత్రము వారి కుపయోగకారియే యయ్యెను.

పై సందర్భముల నెల్లఁ జక్కగ విమర్శించి చూచిన నా యా దేవాలయములయందలి ఆచార్యు లందఱు సాధారణ గ్రీకులకంటె నెక్కుడు తెలివిగలవారనియు, ఎక్కుడు లోక వ్యవహారముల నెఱింగి కొనుచుండువారనియుఁ దెలియక మానదు. వీరు ముందువెనుకలు బాగుగ యోజించి కొంచె మించుమించుగ రాఁబోవు సంగతులను గూఢవాక్కులచే వెలిబుచ్చు చుండిరనియుఁ దేటపడఁగలదు. లోకము నందలి విషయముల వీరు జాగరూకులై గమనించు చుండి రనియుఁ దీర్మానింపవలసి యున్నది.

డెల్ఫీ దేవాలయము క్రమక్రమముగఁ బ్రాముఖ్యత నొందుచుండెను. రాజులును బట్టణాధికారులును బహుమతు లపై బహుమతు లనుపుచుండిరి. ప్రతిమలు, అలంకారపాత్ర ములు, పూజాసాధనములు, ముక్కాలుపీటలు మున్నగు వస్తువులతో నాలయభాండారములు నిండిపోయె. ఇందు

విశేషభాగము బంగారుతోఁ జేయఁబడిన వగుటవలన డెల్ఫీ ధనవంత మయ్యెను. సంపదతోడఁ గీర్తియు నెక్కుడొడంగె. గ్రీకు లెల్ల రిద్దానిని జాతీయ దేవాలయముగ నెన్నఁ బ్రారంభించిరి. ఆ ప్రాంతములఁ గల పట్టణము లనేకములు డెల్ఫీ స్వాతంత్ర్యమును గాపాడుటకై యొక సంఘముగఁ జేరెను. దేవాలయపు శుభముల నరయుటకొఱక 'పంచాయతి' నేర్పఱచి గ్రీసుదేశమందుఁ దల యెత్తికొని యుండిన పండ్రెండు నగరరాష్ట్రములును దమ ప్రతినిధుల సంవత్సరమున రెండు మారు లీ పంచాయతి సభల కనుపుచు వచ్చెను. ఈ పంచాయతి సభకు గ్రీకుభాషయందు 'అమ్ఫిక్టియోనిక్ లీగు' అన, 'పరిసరజనసభ'యని పేరు. చుట్టుముట్టు గల ప్రజలచే నేర్పడిన సభ గాన దాని కట్టి పేరు వచ్చుట సహజమే. ఈ సభ వారి ప్రతిన "దేవుని సొమ్మును కొల్లగొట్టువానిని, కొల్లగొట్టు కుట్రయందు గలవానిని, దేవాలయవిషయములం దేనియం దైనను దురాలోచన లొనర్చు వానిని, ఈ గతి వానినెవ్వని నైనను మేము మా హస్తములచేతను పాదములచేతను స్వనముచేతను మఱి మా శక్తియందు గల ఇతర సాధనములచేతను శిక్షించెదము" అని. యుద్ధము జరుగుచుండెడు సమయముల నీ దేవాలయమునకే హానియు రానీక సంరక్షించుట "పరిసరజనసభ" వారిధర్మము. ఏదో యొక కారణమున నాలయము గాలిపోయిన, నద్దానికై ద్రవ్యము సేకరించి మఱలఁ గట్టించుటయు వీరి పనియె. 'పైథ' ననఁబడు

నా గండభేరుండుని నపోలో జయించెనని మా చదువరులు విని యున్నారు గదా. ఆ విజయమును జ్ఞాపక ముంచుకొనుటకయి ప్రతిసంవత్సరమును డెల్ఫీలో "పిథియన్ పందెము"లని పెద్ద యుత్సవములు జరుగు చుండును. ఆ యుత్సవముల నిర్వహించుటయు నీ సభ వారికిఁ గర్తవ్యాంశములలో నొక్కటియె.

పరిసరజనసభ

ఇట్లు మతవిషయక కార్యనిర్వహణమునకుగా నేర్పడిన నీ "పరిసరజనసభ" యొక విధమగు రాజకీయసంధికిని గారణ మాయెను. ఈ సభయందలి నగర రాష్ట్రములు దమలోఁ దాము "మా సభ యందలి యే పట్టణమును నశింపఁ జేయము. ఏ పట్టణమునకును పారుదల గల నీటిని యడ్డగింపము" అని తీర్మానము చేసికొనిరి. ప్రతిఘటించి యొక్కటితో నొక్కటి పోరాడుకొనుచుండు గ్రీకుపట్టణ రాష్ట్రముల కిప్పటి స్నేహభావము మిక్కిలి శ్రేయస్కరము గదా!

ఈ విధమున డెల్ఫీ, గ్రీకులకు మతస్థానము మాత్రమెగాక సర్వ విషయముల యందును గురు పీఠమాయెను. ఎచ్చటనే కార్యము దలపెట్టినను అపోలో యభిప్రాయము మున్ను తెలిసికొనుట యాచారమై యేర్పడియె. అధినివేశముల సంస్థాపింపఁ బోవు తరిఁ గూడ నపోలో యాశీర్వాదంబులఁ గొని గ్రీకులు బయలు వెడలు చుందురు. అతని సాహాయ్యము లేక గ్రీకులకు శ్రేయమే సున్న.

అన్ని పనులతోఁగూడ నపోలో సేవకులగు నాచార్యులకు గ్రీకు పంచాంగమును సిద్ధపఱచుటయుఁ గర్తవ్యమయ్యెను. ప్రతి ఋతువును నేదో యొక దేవతకుఁ బ్రియతమంబుగ నెంచఁబడు చుండెను. కావున ఋతువుఋతువు నందును వేర్వేరు పండుగలు నియమితమయి యుండెను. పండుగల ననుసరించియే గ్రీకుపంచాంగ మేర్పడు చుండెడిది. పండుగలకు నిర్ణీతస్థలములును గలవు. కొన్ని పండుగలకు నాయా ప్రాంతముల జనులు మాత్రమే చేరుచుండిరి. మఱి కొన్నింటికి దేశపు నాలుగు చెరగుల నుండియు ప్రజ లేతెంతురు.

జాతీయోత్సవములు

జాతీయోత్సవము లందెల్లఁ బేరొందినది 'ఒలింపియా యుత్సవములు.' గ్రీకులు మొదటి ఒలింపియోత్సవమునుండి యొక శకము నేర్పఱచుకొని రనిన నీ జాతర లెంత ముఖ్యములుగ నెన్నఁబడు చుండెనో విశదపడఁ గలదు. ఒలింపియాయందు నాలుగు సంవత్సరముల కొకమారివి జరుగుచుండును. అంతకు మున్ను కొన్ని పర్యాయము లియ్యవి జరిగియుండె ననుటకు సందేహము లేదు గాని గ్రీకులు క్రీ.ము. ౭౭౬-వ సంవత్సరమున మొదటి యుత్సవము నడచినట్లు తలంచి యా యేట నుండి ఒలింపియా శకమును గణింపఁ జొచ్చిరి. ఈ యుత్సవము మొదట మొదట జ్యూసు నారాధించుటకై యనేక రాష్ట్రములనుండి చేరు ప్రతినిధులచే నడుపఁబడుచు వచ్చిన

గొప్ప యజ్ఞసమయము. కాని జనులు సమూహము చేరిన చోట నెల్లయు, ముఖ్యోద్దేశ మెద్ది యైనను, సర్వసాధారణముగఁ గొంత మనోల్లాసకరములగు ప్రదర్శనములు పొడసూపుట సహజము. ఒలింపియాయందు గ్రీకులు దమ యుత్సవములయందు సంగీతము, విందులు, వివిధములగు సాములు చొప్పించిరి. మొదట కొంచె మయ్యు, రాను రా నీయంశము లె జాతరలయందు ముఖ్యములయి, ముఖ్యతరములయి, ముఖ్యతమములయ్యెను. ఉత్తమవ్యాయామపరీక్ష లేర్పడెను. యత్నికులు పందెములయందు బహుమానములు వడయు నుద్దేశించి గుంపు లుగుంపులుగ నల్గడలనుండి రా నారంభించిరి. ఎలిసుమండల మందలి అల్ఫియసు నదీప్రవాహమున కాకరమగు గొప్ప సమభూమియం దీ పరీక్షలు నడచు చుండెను. ఇందే మన దేవదారువృక్షములబోలు 'ఆలివు'లను గొప్ప భూజముల చల్లని నీడయందు జ్యూసున కర్పితంబగు దేవాలయం బుండెను. దీని కనతిదూరంబున పందెపు బాటలుండెడివి. ఇందొక్కటి నడకపందెములకును, రెండవది గుఱ్ఱపుపందెములకును, అనగా రథస్పర్ధీకరణంబులకును నేర్పడియుండెను. ఈ బాటల కిరుప్రక్కలను జుట్టును జూపరులు నిలుచుటకును ఆసీనులగుటకును స్థలము సిద్ధపఱుపఁబడి యుండెను. గ్రీకు లన్ని విధములగు శరీరవ్యాయామముల యందును మిక్కిలి యుత్సాహముగలవారు. ఎట్టి పరిశ్రమములకును నెట్టి పోటీలకును వీరు వెనుదీయువారు గాక ముం

డుఁ బడి పని సేయు చుందురు. విద్యాలయములయందలి బాలురును సామాన్యగరడీలయందలి యౌవనులును దమలోఁ దాము పరువెత్తుట, మల్లయుద్ధము సేయుట, ముష్టియుద్ధమొనర్చుట, మొదలగుఁ గార్యములను ఉద్దు లేర్పఱచుకొని యభ్యసించు చుందురు. ఒలింపియావ్యాయామపరీక్షలకు నర్హతగల వాఁడని యనిపించు కొనుటకంటె నీ బాలకులకును నీ యౌవనులకును నెక్కుడు గౌరవము లేకుండెను. ఇంతయయ్యును నొలింపియాయుత్సవ మెప్పుడును దన పవిత్రతను మతసంబంధమును గోల్పోయినది గాదు. ఇందు ప్రారంభాంక మనవరతము జ్యూసున కప్పనమగు నొక గొప్ప యజ్ఞము. దీనికిఁ గర్తలు, ఎలిసు మండలావాసులు. వీరు సభ చేరి యితర ప్రదేశములనుండి విచ్చేయు గ్రీకుల కాహ్వానమొసంగుదురు. అతిథులును ప్రయప్రయాసలకోరిచి జ్యూసు మహాప్రభువునకు దమ విధేయత నగుపఱచుటకు వలయు సర్వసన్నాహములతో నేతెంచి ఎలిసుమండలస్థులను గౌరవింతురు. జన్నము తీరిన తరువాత యత్నికులు తమ గురువులతోడను మధ్యవర్తులతోడను సభామంటపమునఁ జేరుదురు. అచ్చట వీరు తాము గ్రీకుపౌరతకు సంపూర్ణార్హత గలవా రనియుఁ గ్రమమగు విధుల నన్నియు గమనించి రనియుఁ, బందెములనడకకై చేయఁబడిన సూత్రముల నన్నింతురనియుఁ, బ్రతిన సేయుదురు. అటుమీఁద వ్యాయామపరీక్షలు ప్రారంభ మయి మూఁడుదినములు జరుగును. అందు

విశేషము జనానురంజకములగునవి రథస్పర్థీకరణములు. గ్రీకులు దమ సారథ్యశక్తి కనంతముగఁ బొంగుచుందురు. ప్రప్రథమున నీ పరీక్షల యజమానియే యరదము నడుపుచుండెను. కాని కాలక్రమమున నీకార్యమున కితరుల నియోగించుకొనుట యాచారమాయెను. ఇప్పుడు మన యండెట్లో యప్పుడును గ్రీకులయందును బహుమానము గుఱ్ఱముల యజమానికే పోవుచుండునుగాని సారథికిఁ జెందుట లేదు. అయిన సారథి గూడ మఱియొక విధమగు గౌరవ బహుమాన మందుచుండెను. పారితోషికములు పండుగ కడపటి దినమున బహిరంగముగ నియ్యఁబడుచుండెడివి. జ్యూసునకుఁ బ్రియమగు వనమునందలి యేదో యొక్క యాలివు తరువునుండి కోసిన, సుందరమగు రెమ్మలచే నల్లబడిన మకుటములే విజయులగు యత్నికులను గౌరవించు బహుమానములు. తమతమ పట్టణప్రజలవలన వీరు ధనరూపంబును నితరవిధములునునగు బహుమతు లందుచుండిరి గాని గ్రీకు లవ్వాని కై యాశించినదే లేదు. ఆలివుమకుటములే యుత్తమాదరణములుగను నున్నతాభరణములుగను నెన్ని, వాని కయ్యె యెంతో ప్రయాసబడుచుందురు. బహుమానములు పంచిపెట్టిన పిదప దైవమునకుఁ గృతజ్ఞతను సూచించుటకగు హోమము లొనర్చి విజయులకొఱకొక గొప్పవిందు జరుగును. అందు వారిని వేర్వేర పాటల

చేతను పద్యములచేతను బాగడి ద్రాక్షారసము విపులముగ నుపయోగించి గ్రీకు లా పండుగను ముగింతురు.

సర్వజనసమాదరణీయంబై యపవాదరహితుండగు ప్రతిశుద్ధ గ్రీకు పౌరునకును ప్రవేశార్హంబై యితర జాతుల కును బానిసలకును జూచుటకైనను జొర రానిదై పండు గలలో నెల్లఁ బండుగయయిన ఈ యొలింపియాయుత్స వము గ్రీకుల సోదరభావమును బురికొల్పుచుండె ననుట కేమి సందియము?

ఈ రీతి పండుగ లితరస్థలములయందును జరుగు చుం డెడివి. డెల్ఫియందు అపోలో కల్పితములగు 'పిథియన్ పందెము'లు జరుగుచుండును. అతనికిని గండభేరుండమున కును జరిగిన పోరాటమును సంకేతించుటకై ఏర్పాటుపఁబడిన ససంగీతంబగు బొమ్మలాట యచ్చటి యంశములలో ముఖ్య మైనది. కొరింతునందును మఱి యితరస్థలములయందును నాయా స్థలదేవతాప్రీత్యర్థము పండుగ లనేకములు స్థాపిత ములయి యుండెను. కాని ఒలింపియా పండుగలే యన్ని టికంటె పురాతనములును ముఖ్యతరములును. గ్రీకుచరిత్రకు మున్నే యివి ప్రారంభమయి గ్రీకుచరిత్ర యంతమయిన తరువాతఁ గూడ నిలచియుండెను. గ్రీసు స్వాతంత్ర్యము గోల్పోయి, రోమకసామ్రాజ్యమందలి మండలమై యేర్ప డిన పిదప విజయులగు రోమనులే యీ పండుగల నిర్వహింప సమకట్టిరి. మొన్న నిన్న ఆథెన్సులో జరిగిన వ్యాయామ

పరీక్షలయందు నైరోపాప్రజ లెల్లరును జేరియుండినను నవ్వానికి 'ఒలింపియా' వ్యాయామములనియే పేరు పెట్టుట చిత్రము గదా!

ఆటలయందు ప్రీతియు, వ్యాయామములయం దభిలాషయు, గ్రీకులకును వారి పొరుగున నుండిన బౌరవాత్యులకును గల భేదము. స్వాతంత్ర్యమునందు గాఢమగు నపేక్షయు నిరంకుశాధికారము నెడ ననిష్టంబును వారియందలి రెండవ విశేషగుణము. రాష్ట్రము రాజుచే బరిపాలింపఁబడు చుండినను నతఁ డిచ్చకు వచ్చినట్లు ప్రవర్తింప దగ దనియు ముఖ్యవిషయముల నెల్లయు జనుల యనుమతి నందవలెననియు వారి మతము. ప్రస్తుత మైరోపాయందు, ఇట్టి మతము విపరీతముగఁ గనుపడదు గాని పురాతనకాలమున నిది యసామాన్యము. ఎచ్చటనేని ఎవ్వండేని గ్రీకుప్రభువు ప్రజల మేలునకుఁ గాక తన సంతోషమునకై రాజ్యము సలుపునట్లేర్పడిన వా రొక్కటిగఁ జేరి యతనిని వెడల నడతురు. ఇట్లగుట గ్రీకురాష్ట్రము లన్నియు రాజులఁ దీసివైచి, ప్రజాసంఘమువలన నిర్వచింపఁబడిన యధికారుల మూలమున రాష్ట్రపరిపాలనము నడపింపఁ జొచ్చెను. ప్రజలచే రాజ్యనిర్వహణమును బ్రయత్నించుటకు గ్రీకులె మార్గదర్శకులు. వారి భాషనుండియె ప్రజాపరిపాలనమునకు సరియగు నింగ్లీషుపదముత్పన్న మయినది. గ్రీసు దేశమున నన్నివిధము

గ్రీకులయందు గుణములు

లగు పరిపాలనాపద్ధతులును ప్రయత్నింపఁబడెను. కావునఁ దక్కిన విషయంబులం బలెె నీ విషయంబునను వీరికంటె వెనుక ప్రబలినజాతులు వీరినుండి జ్ఞానము సంపాదింపఁ గలిగిరి.

గ్రీకులయందలి మూఁడవ విశేషము సౌందర్యప్రియత్వము. వీరు కట్టిన దేవాలయములును, చెక్కిన ప్రతిమలును, ప్రపంచమునందెల్ల నిప్పటికిని యుత్తమములై సర్వకాలములందును బనివారలకు మార్గదర్శకములై యున్నవి. వారి భాషయు నిరుపమానమై శ్రావ్యమైనందున నిప్పటికిని వారి వాఙ్మయమనేకులచేఁ బఠియింపంబడు చున్నది. దాని ఛాయనైనను ఇతరభాషలయందు వ్రాయలేకున్నారు.

గ్రీకు లందఱును దమ దేశమును మిక్కిలి ప్రేమించుచుండిరి. వారికి జనహితబుద్ధి మెండు. యుద్ధసమయములయందును, ఇక్కట్టుకాలములయందును, భాగ్యవంతులగు పౌరులు దమంతటఁ దామె రాష్ట్రములకు వలయు నోడల నిర్మించి యిచ్చుటయందును, సైన్యములఁ జేర్చి యిచ్చుటయందును, పరిశ్రమచేయుదురు. శాంతిసమయములందును పండుగల సందర్భములను ప్రదర్శింపఁబడు నాటకాదులకు ద్రవ్యసాహాయ్యముచేయుట ధనికులకు గౌరవనీయముగ నుండును. కారణము. ఈ ప్రదర్శనములవలన దేవతలకుఁ బ్రీతియగుటయె గాక పురజనులకును జ్ఞానానందము లబ్బు

చుండెడిని. ఈ పగిది గ్రీకు లెల్లరకును 'రాష్ట్రము మొదటిది, తాను తన కుటుంబము దరువాతివి యనియు, మొదటి దానిలోఁ దరువాతివి మగ్నముగావలసిన' దనియు, బ్రారంభమునుండి గఱపఁబడు చుండెను. చుట్టుముట్టుం గలవారిం క ననాగరికులుగ నుండగనే గ్రీకులకు సభ్యత్వమును దన్కాలమున నాచంద్రతారార్కంబగు ప్రఖ్యాతిని సంపాదించి పెట్టినది యీ స్వచ్ఛందరాష్ట్రభక్తియే.

## నాలుగవ ప్రకరణము

### లైకర్గసు—గొప్పసంస్కర్త

కథ లాధారముగాఁ గల హోమరుయుగమునకును గ్రీకులచరిత్రమున మొదటియుగమునకును మధ్యకాలమున జరిగిన విషయములను గుఱించి మనకు విశేషములు దెలియవు. పుక్కిటిపురాణములను బట్టి కొంత గ్రహింపవలసి యున్నదే కాని మఱియొకవిధమగు సాహాయ్యమేమియుఁ గానరాదు. గ్రీసునం దక్కాలమునఁ బ్రజాసంచలన మెక్కుడుగా నుండె ననుట మాత్రము స్పష్టము. ఉత్తరభాగమునుండి గుంపులుగుంపులుగ జనులు 'థెస్సలీ' నాక్రమింపఁ జొచ్చిరి. ఆ మండలమందలివారలు దక్షిణమునకుఁ బ్రయాణమయిరి. అప్పుడు 'డోరిసు' నందుండిన ప్రజలు 'పెలిపొనీసనుకుఁ' దరలిరి. కాని యచ్చట వీరికి బలమగు నాటంకములు దటస్థించినట్లు గనుపించు చున్నది. వీరి నెదిర్చిన 'ఆకియనులు' స్వల్పశత్రువులు గారు. రెండు పర్యాయములు వీరి నోడించుటయె గాక, వీరి నాయకులను వెన్నంటితరిమి, అట్టికా యందు శరణుఁ జొచ్చునట్లు చేసిరని తోచుచున్నది. మూఁడవ దండయాత్రయందు డోరి

యనులు ఇటోలియాయందలి కొంచెము నాగరికులును.
కావున నెక్కుడు బలవంతులును నగుc గొందఱు యోధుల
సాయము చేసికొని 'కారింతుఖాడీ'ని దరించి, ఆకియనుల
నోడించినట్లు తెలియుచున్నది. ఇట్లాకియనులను బారదో
లిన తరువాత, నిటోలియాప్రజ సారవంతమగు 'ఎలిసు'
మండలమును, డోరియనులు దక్షిణగ్రీసునందలి ఇతరభాగ
ములను, క్రమక్రమముగ నాక్రమించుకొనిరి.

గ్రీకు లెల్లప్పుడును దా మా దేశమువారలే యనెడి
నభిమానము గలవారుగాన నీ పైసంగతులను మఱగు
పఱచు నీ క్రిందికథ పారంపర్యముగ వాడుకొనుచున్నారు
కాని దీనివలననే పై యంశము లొకకొన్ని స్థిరపడcగలవు.

ఆకియనురాజవంశములో భీమబలుండగు 'హెరక్లీసు'ను
నతcడొక్కండు గలcడు. 'యురిస్తియస'ను వాcడతని జ్ఞాతి.

మఱియొక కథ

ఈ జ్ఞాతికి లోcబడి యతc డొనర్చు మనిన
పండ్రెం డద్భుతకార్యములు హెరక్లీసు
నెరవేర్చవలయుననియు రాజ్యమున కర్తగలవాcడైయె
నను రాజ్య మాతనికి రాదనియు నతనికి శాపము. మృత్యు
వుచేతనె యీ శాపము నశించుటంజేసి హెరక్లీసు దేవత్వ
మందెను. అతని కుమారులను గూడ యురిస్తియసు వేధిం
పc జొచ్చెను. వా రాథెన్సున దాగుటc దెలిసికొని యచ్చ
టికి వారిపై దాడివెడలc బ్రయత్నించెను. కాని యుద్ధ
మున నతcడును నతని పుత్రులును మడయుటవలన దండ

యాత్ర నిలచిపోయెను. హెరక్లీసు పెద్దకొడుకగు 'హిల్లసు,' దండ్రిరాజ్యమును సంపాదింపఁ జూచెను. అతనిని ఆకియనుల సైన్యము కొంరితుభూసంధికడ నెదిర్చెను. రెండుపక్షములవారి సమ్మతిమీఁద ఆకియనులు నిరూపించు వీరునితో హిల్లసు ద్వంద్వయుద్ధము సేయునట్లును ఎదిరిని జంపెనేని యితఁడు రాజ్యమును స్వీకరించునట్లును లేకున్న నితండును, నీతని సంతతివారును నూరుసంవత్సరములు రాజ్యమునుండి తొలఁగిపోవునట్లును సమయమేర్పరుపఁబడెను. ద్వంద్వయుద్ధమున హిల్లసు పరాజితుఁడయి మృతుఁడయ్యెను. అతనిసంతతి హెల్లెనుమునిమనుమఁడగు నొక డోరియను రాజునెడఁ జేరి యీ సమయమును న్యాయముగ జరిపిరి. నూఱేండ్లు ముగిసిన తరువాత హిల్లసు ప్రపౌత్రులు ముగ్వురు 'ఆరిస్టొడీమసు' 'క్రెసుఫాంటీసు,' 'టిమీనసు' అనువారలు మరల దమ పితృవ్యుల రాజ్యమును డోరియను సైన్యముల సాహాయ్యమున సంపాదింప సమకట్టిరి. వారి కనేకారిష్టములు దటస్థించెను. ఆరిస్టడీమసు చనిపోయెను. వ్యాధులు మెండయ్యె, గాలివానచే నోడలు చెదరఁగొట్టఁబడియె. అట్టి సమయమున మిక్కుంగల యిద్దఱు హిల్లసుప్రపౌత్రులును డెల్ఫిభవిష్యత్ప్రదర్శినిని సలహా యడిగిరి. "మూఁడుకండ్లమనుష్యుని సహాయ్యము గొంటిరేని మీకు విజయం బగునని" ప్రత్యుత్తరము పొందిరి. దానిపై నిట్టి వికృతస్వరూప మెచ్చట దొరకునా

యని యోజించుకొనుచు, టిమోనసు వచ్చుచుండ దారిలో నొక యేకాక్షియగు రౌతు కంచరగాడిదపై స్వారిచే యుచు నెదురుపడియెను. అప్పుడు టిమోనసు బాగుగ విమర్శించిచూచి డెల్ఫీదేవత యర్థమట్లే యుండవలెనని తలఁచి యా యుగ్యమును, నారోహకుని జేర్చి యొకమను ష్యునిగ నెంచిన మూడుకన్నులు గలవాఁడగునని నిశ్చ యించి వానిని దమకు సాయపడ నేతెమ్మని వెంటబెట్టు కొని పోయెను. వాఁడు వీరు పట్టఁబోవురాష్ట్రము బాగుగ గుర్తెఱింగినవాఁ డగుటవలన వీరి యుద్యమమునకు బ్రబల సాహాయ్య మొనర్పఁ గలిగెను. క్రెసుఫాంటేసుటిమోన సులు నావికాసైన్యముతోఁ బ్రయాణమును సాగించిరి. ఎదుటితీరమున దిగి, డోరియనుసైన్యము దక్షిణ గ్రీసుఁ జొ చ్చెను. ఆకియను లెదురుపడి పోరి పరాజితులై పరువెత్తి పోయిరి. పెలిపొనీసునందు విశేషభాగము హిల్లసు ప్రపౌత్రుల చేతికిఁ జిక్కెను. వీరు సారవంతమగు నెలిసు మండలమును దను ద్రోవచూపుడుకాఁడుగఁ బరిచర్య యొనర్చిన ఆక్సిలసునకుఁ గృతజ్ఞతాపూర్వకముగ నిచ్చిరి. మృతినొందిన ఆరిస్టోడీమసున కిరువురు కుమారు లుండుటం బట్టి తక్కుంగల రాజ్యమును మూడుభాగములుగ భాగిం చి చీట్లువేసి యెవ్వరి భాగ్యమునకు వచ్చినది వా రంగీక రింప నేర్పఱచుకొనిరి. టిమోనసునకు నార్గాసు, ఆరిస్టోడీ మసు ఇరువురు బిడ్డలకు స్పార్టా, క్రెసుఫాంటెసుకు మెస్సీ

నియా తీర్మానమాయెను. ఈ ముగ్గురుభాగస్వాములును వేర్వేరు వేదులపై భగవంతునకు బలి యొసఁగిరి. ఒక్కొక్కెడ నొక్కొక్క దైవికచిహ్నవిశేష మగుపడెను. టెమినసు కొక్క మండూకంబును, ఆరిస్టొడీమసు కుమారులకు సర్పంబును, క్రెసుఫాంటీసున కొక గుంటనక్కయుఁ జూడనయ్యెను. ఈ చిహ్నములయందే ఆయా శాఖాగుణవిశేషములు వెల్లడియయ్యెను. ఆర్గాసు చాకచక్యములేక మందమయియుండు ననియు, స్పార్టా ధైర్యముం జూపి ముం దంజవేయుచుండు ననియు, మెస్సీనియా యుక్తులకాకరమగు ననియు గ్రీకులు గ్రహించిరి. ఈ రాష్ట్రముల చరిత్ర మిద్దానిని స్థిరపఱచెను గదా!

ఇక్కథయందెంత సత్యముగలదియు నిదివఱకె వ్రాయఁబడియెను. ఆర్గాసు మొదటమొదట మిక్కిలి ప్రాముఖ్యతనుగాంచెను గాని కొంత కాలమునకుఁ దరువాత నది క్షీణించిపోవ స్పార్టా యభివృద్ధినొందఁజొచ్చెను. ప్రారంభమున లాసిడమోనియనులకు (అనగా స్పార్టావారనుట) ననేకాతంకములు చూపట్టెను. చుట్టును బర్వతములు గ్రమ్ముకొనియుండుటవలన దిగ్విజయము గష్టతరముగనుండెను. ఆరిస్టొడీమసుపుత్రు లిద్దరగుటచే వారి కాలమునను వారికిఁ దరువాతఁగూడ స్పార్టాకు రాజద్వయమేర్పడి పరస్పరకలహములవలన రాష్ట్రశక్తిని దగ్గించుచుండిరి. స్పార్టా యిట్టి

స్పార్టా దుర్బలము
లైకర్గసు జననము

బలహీన స్థితియందుండ నా రాష్ట్రప్రజల యదృష్టమువలన రాజసంతతియందే 'లైకర్గసు' అను నొక మహా సంస్కర్త పుట్టెను.

ఇతఁడు 'పాలిడిక్టసు' అను రాజు తమ్ముఁడు. ఒక్క చిన్న కొడుకును వదలి పాలిడిక్టసు పరలోక గతుఁడయ్యెను.

నింద

అప్పుడు లైకర్గసు సింహాసన మాక్రమించు కొనుట మిక్కిలి సులభముగనుండెను. కాని యా బిడ్డఁడు యుక్తవయస్కుఁడగువరకు రాజ్యభారము వహించుటకుమాత్ర మితఁడంగీకరించెను. రాష్ట్రమున వలయు సంస్కారముల నీతఁడు వెనువెంటనె ప్రారంభించుట కొక యంతరాయము సంభవించెను. జను లన్యాయముగ నితనిపై రాజ్యమాక్రమింప నుద్యమించుచుండె ననెడి యపవాదమును మోప మొదలిడిరి. దానికిఁ దలయొగ్గ లేక లైకర్గసు స్పార్టానువిడిచి కొంతకాలము దీర్ఘయాత్ర వెడలెను.

అతఁడు మొదటఁగాంచినది 'క్రీటు' ద్వీపము. అచ్చటి చట్టముల ముచ్చటయుఁ బ్రజల సామాన్యత్వసహనశక్తు

ప్రవాసము

లును గాంచి యితఁ డాశ్చర్యమందెను. అచ్చటినుండి చిన్నఆసియాకు దాటిచని అందుఁగ్రీటు స్థితిగతులకుఁ బరస్పర విరోధంబగు విశేషంబులఁజూచెను. జనులు లేనిపోని యాడంబరములు గలవారయి యనుచితవ్యర్థవ్యయకారులుగ నుండిరి. వారింగడచి యితఁ

డక్కాలమున సర్వరాష్ట్రములయందును సభ్యత్వమునకు మిన్న యని చెన్నువహించిన 'ఈజిప్టు' దేశమునకుఁ బ్రయాణంబై యచ్చట విశేషజ్ఞానమలవడఁ జేసికొనియెను. ఈజిప్టు' రాజకీయనిర్వహణపద్ధతులును, నందు ముఖ్యముగఁ బ్రజలు దమతమ వృత్తుల కనుగుణముగ విభజింపఁబడి యుండుటయు నితని ప్రశంసాశక్తులఁ బురికొల్పెను.

తిరిగివచ్చుట

ఇట్లు గొన్నిసంవత్సరములు గడచిన తరువాత స్పార్టనులు లైకర్గసు సుగుణములఁ జక్కగ గుర్తెఱింగి యాతని ముమ్మారు 'రావే'యని ప్రార్థించుచు నాహ్వానమంపిరి. వెలుగు లేని యప్పుడు గదా దాని యావశ్యకత గాన్పించును! లైకర్గసుకూడ మఱలి రా నిశ్చయించి డెల్ఫిభవిష్యత్ప్రదర్శిని యాశీర్వాదములందఁ జనియెను. అతఁడేమియు నడుగకమున్నె యాచార్య యాతని సంబోధించి,

గీ. సంపదలచేత శోభిల్లు సదన మిద్ది
దీని జేరంగవచ్చితి; దివ్యులలర
జ్యూసు ప్రేమను గడియించి వాసిగాంచి
నరలు లైకర్గసా నీవు, నరుఁడ వగుదె?
నరుఁడొ? దివిజుఁడొ? నే నిన్ను సురల నెంతు.

నని వాక్రుచ్చెనట. అతఁడు దాను స్పార్టానుగా నేర్పఱుపఁబోవు చట్టములు జయప్రదములగునా యని ప్రశ్నించెను. దానికి నాతడు నెరవేర్చు పద్ధతులు లోకమాన్యములగునని

యుత్తర మొసగఁబడియెను. ఇట్లుత్తేజితుఁడయి లైకర్గసు ఉత్తమసంస్కారములు ప్రచరింపఁ దన రాష్ట్రమునకు వచ్చి చేరెను.

మొట్టమొదట రాజుల కలహము లాపుట యత్యావశ్యకముగ నుండెను. దానికి ముఖ్యసాధనము వారి యధికారమును మితపఱచుటయే. ఈ పనియందు లైకర్గసున కేమియు నభ్యంతరము సెప్పుటకు వీలులేకుండెను. డెల్ఫీయందే యతనికి "స్పార్టాయం దిద్దఱురాజులు రాజ్యము చేయుచుండ వచ్చును గాని, శిష్టసభయు (గ్రీకుపేరు 'గిరాసియా'), ప్రజాసభయు (గ్రీకుపేరు 'అపెల్లా') రాజ్యాంగమున భాగము గలవారుగ నుండవలెనని" యుత్తరువయి యుండెను. కావున నాతని చట్టముల ననుసరించి యిరువురు రాజులును శిష్టసభయందొక్కయంశమగుట దటస్థించెను.

శిష్టసభ

శిష్టసభయు మార్పును జెందెను. ఇరువదియెనుమండుగురు సభ్యులు అరువదిసంవత్సరములకుఁ బైఁబడిన పౌరసంఘమునుండి నిర్వాచింపఁబడుచు వచ్చిరి. వీరలతో నిద్దఱురాజులంజేర్చిన శిష్టసభకు ముప్పదిగురు సభ్యులయిరి. ఏతీర్మానమైనను సమ్మతుల సంఖ్య ననుసరించి యేర్పడుచు వచ్చుటవలన రాజులీసభల కధిపతులే యైనను వారి యధికార మత్యల్ప మయిపోయెను. అయిన రాజుల కితరవిషయములఁ గొన్ని హక్కులు గలవు. ముందు వర్ణింపఁబడఁ బోవు 'సామాన్యభోజనశాల'లో వీరికి ద్విగుణ

భాగ మిచ్చి గౌరవింతురు. మతవిషయములఁ బ్రథమ స్థానము వీరిదియె. దండనాయకులు గూడ వీరె.

ప్రజాసభకును లైకర్గసు చట్టములవలన రాజ్యాంగ కార్యనిర్వహణమున నెక్కుడు సంబంధము కలిగెను. శిష్ట సభయందు తీర్మానమైన విషయములును యుద్ధప్రారంభప్రకాశనంబులును, పరస్పర స్నేహభావసంధులును, రాజుల పదచ్యుతులఁ జేయు నుద్యమములును, ప్రజాసభయంగీకార మందవలసి యుండెను. ఎప్పటంబలెఁ ప్రజాసభవారు కేకలవలనఁ దమ యభిప్రాయము దెలియఁజేయవలసియుండుటచేత నీ యధికార మంత యుపయోగకారి కాకుండెను.

ప్రజాసభ

రాజులు దండనాథులని నుడివితిమి. వా రెప్పుడును యుద్ధభూములయం దుండుచువచ్చినందునఁ బ్రజలు వారు లేనితరి వారి ధర్మముల నెరవేర్చుటకుఁ గొందఱు న్యాయాధికారుల, సామాన్యముగ నైదుగురిని, ఎన్నుకొనుచు వచ్చిరి. వీరు క్రమక్రమముగ బలవంతులై శిష్టసభకును రాజులకును పైయధికారులైరి. కాని యిందంతయు, వీరి పుట్టుకయే, లైకర్గసునకుఁ జాల కాలము దరువాత.

రాజకీయవిషయములఁ గట్టుబాటులోనర్చుటతో నిలచి యుండిన, లైకర్గ సింత ఘనత వహించి యుండఁడు. అత డుపక్రమించిన సంఘసంస్కారములె ముఖ్యతమములు. స్పార్టాజనులు మోటువారలును దరిద్రులును. తమ యుని

కిం బట్టి వా రెప్పుడును నిరుగుపొరుగువారలతోఁ బోరుచుండినఁగాని తీర కుండెను. కావున స్పార్టాకు వలసినది సైన్యబలము. దానిని హెచ్చించి, స్థాపించి, పూర్ణాంగవిశిష్టం బగునట్లు పన్నుట గర్తవ్యమని యతఁడు గ్రహించి యీపనికిఁ బూనెను.

సంఘశిక్షణ

స్పార్టనునకు పుట్టుకతోడనె శిక్షణ ప్రారంభమగును. జన్మించిన శిశువును శిష్టులు బరీక్షింతురు. అది యారోగ్యవంతమే యయ్యెనేని దానిని బ్రతుకనిత్తురు. పుష్టిలేక బలహీనంబయి గాన్పించెనేని వెంటనె టెయిగటసుపర్వతముపైఁ గొనిపోయి, దాని నడవిపాలొనర్తురు. ఏడుసంవత్సరముల వయసున ప్రతిబాలుఁడును దలితండ్రుల యిల్లు వెడలివచ్చి 'రాష్ట్రశిక్షణాలయంబు'ల నివసించవలెను. అచ్చట వీరు దమ జీవితకాలమునకు వలయు శిక్షణ నందుదురు. ఎల్లప్పుడును నగ్నపాదులై సంచరించవలసినదే. పరితపింపఁ జేయు వేసవి కాని, ముబ్బు వీడని వర్షాకాలము గాని, నవనడ వడంకఁ జేయు శీతకాలము గాని వీరి కొక్క యుడుపుల జతయె గాని రెండవది గూడదు. తాము చేతులారఁ గోసికొని వచ్చిన జంబుచేఁ దామే యల్లుకొనిన చాపలే వీరికి హంసతూలికాతల్పములు. వంట దామే వండుకొని వడ్డించుకొనవలసినదే గాని, పరిచారకులు లేరు. వీరి కిచ్చు బత్తెము మిగుల స్వల్పమును ననాకర్షణీయంబును నయి వీరిని వేటాడుటకును

మ్రుచ్చిలివించుటకును బురికొల్పుచుండును. ఈ బాలురు సమీపవనంబులనుండి దొంగిలి పొట్టఁ బోసికొనుచుందురు. అయ్యది స్పార్టాచట్టములకు సమ్మతమె. వీరు పట్టువడి నట్లైన దొంగతనమునకు దండన నందుట లేదు గాని బల హీనత్వమునకును సామర్థ్యలోపంబునకును బహుకఠినం బగు శిక్షకుఁ బాత్రులగుదురు. ఎంతటినొప్పినైనను దృణీక రించునట్టి సహనశక్తి యలవడుటకయి స్పార్టను బాలురు బహిరంగముగ చబుకుదెబ్బలు దినుచుందురు. సహన కాలముకొలఁది గౌరనపరిమితి యగుట, ననేకులు గిక్కు మిక్కు నునక ప్రాణములు గూడ వదలుచుండిరి. మధ్యాం దినభోజనమునకు గాను స్పార్టనుబాలుఁ డొక్కడొక గుంటనక్కను దొంగిలించి తన యుడుపులలో దాచి తీసి కొని పోవుచుండెను. త్రోవయం దొకకొంద ఱాతని నేదో మఱియొక పనికయి యాపిరి. చేతనున్న గుంటనక్క నెచ్చట నిడుటకును నవకాశము లేకపోయె. అదియు మెల్లమెల్లగ నాబాలుని కడుపు చీల్చఁజొచ్చెను. తన్నిత రులు బలవిహీనుండని పరిహసింతురని యున్నస్థలముననెఁ బొట్ట బ్రద్దలయి ప్రాణము వోవువరకును గదలమెదల కుండెనట. ఆహా! ఎంత విపరీతంబగు నోర్పు.

స్పార్టనుబాలురపూర్ణశిక్షణము శరీరవ్యాయామంబును సైనికపరిశ్రమయు నని చెప్ప నొప్పును. భజనగీతము లప్పుడప్పుడీ కఠనాభ్యాసముల బరువును దగ్గించు చుండును.

తన యీడువారలతో 'నగ్నసందర్శ'నోత్సవమున మల్లయుద్ధము, పరువెత్తుట, గీతములు పాడుట, మున్నగు దా నేర్చిన విషయముల ప్రావీణ్యము గనుబఱచుటయే స్పార్టను బాలుని జీవితమునందు ముఖ్యాంశము.

ఇరువదిసంవత్సరములు నిండిన మీఁదట స్పార్టను 'యౌవ్వనుఁడ'ని పరిగణింపఁబడి 'రాష్ట్రశిక్షణాలయంబు' నుండి 'రాష్ట్రశాలల' కనుపంబడును. భోజన మతఁడు 'సామాన్యభోజనశాలలో' నడుపుకొనవలెను. పదునైదుగురు స్పార్టనులఁ జేర్చి యొక్కొకశాల యేర్పఱచుచుందురు. అం దొకరిస్థలము కాళీ యైనచో నుఱియొకరిని జేర్చి సంఖ్య దగ్గకుండ పూర్తిసేయుచుందురు. భోజనము బహిరంగముగ భుజింపఁబడు చుండెను. బత్తెము దిట్టము ప్రకార మియ్యఁబడు చుండెడిది. ఏ పౌరుఁడును నరువది వయసగునర కీశాలల విడిచి బయటఁ గుడువరాదు. ప్రతివాఁడును నివ్వానికిఁ దన భాగపుబత్తెపుసామగ్రి మాసము దప్పక పంపుచుండవలెను. సర్వసాధారణపు వంటలే వడ్డింపఁబడును. బార్లీయన్నము, జున్ను, అత్తిపండ్లు, అంత రుచికరముగాని యొక చారును బూటపూట కేర్పడిన పదార్థములు. మాంసము పండుగదినముల మాత్రము గొననగును.

స్పార్టాబాలికల జీవితము గూడ రాష్ట్రాధికారుల స్వాధీనమున నుండెడిది. వారికి బాలురకుండునన్నికఠిన

నిర్బంధములు లేవు, గాని మొత్తముమీఁద వారి శిక్షణ గూడఁ గష్టతమమే యనఁజెప్ప నొప్పును. కన్యకలను దలిదండ్రులనుండి వేరుపఱచుట లేదు. వారిని తరగతులుగ నేర్పఱచి పరువెత్తుట మల్లయుద్ధ మొనర్చుట మున్నగు దేహదార్ఢ్యమునిచ్చు పరిశ్రమలయందుఁ బ్రవేశపెట్టుచుందురు. వారు బహిరంగముగ వ్యాయామముల నిమగ్నలై పురుషులకంట నెప్పుడును బడుచుండుటవలన స్త్రీల కలంకారములగు నాణ్యత, సిగ్గు, మొదలుగాఁగల కొన్నిగుణములు వారియందు నశించిపోయెను. దేహసౌష్టవమున మాత్రము వారిని మించినవారు లేరు. ధైర్యసాహసంబులను వారితోఁ దులఁదూఁగువా రెక్కడను గానరారు. వారికి స్పార్టాయందలి పౌరులు సూపుచువచ్చిన గౌరవమెచ్చటనుం గానము. ఈ విషయముల సూచించుటకొకచిన్నయుదాహరణము. మఱియొక పట్టణమునుండి విచ్చేసియుండిన యొక నారీరత్నము స్పార్టనుస్త్రీ నొకర్తెం గుఱించి :"లోకమునందు బురుషులపైఁ బ్రభుత్వమూను స్త్రీలు మీరు దప్ప మఱొక్కరు లేర"ని యుల్లాసముగ ననెను. దానికి స్పార్టనుగఱిత "మనుష్యులను, అనగా మనుష్యనామమున కర్హులగుఁ బురుషులను గని, పెంచు స్త్రీలు మేము దక్క మరెవ్వరిం గానమ"ని ప్రత్యుత్తర మొసఁగె నట. స్పార్టాస్త్రీలు భర్తలకును పుత్రులకును యుద్ధసమయముల మిక్కిలి ధైర్యమిచ్చుచుందురు. డాలు

మీఁదనైనను డాలుతోనైనను మఱలి రమ్మని తల్లులు పుత్రుల కాజ్ఞసేయుచుందు రట. మిక్కిలి బరువులగుటచే డాలుతో మరలి వచ్చుట జయించిన మాత్రము సంభవించును. పారి వచ్చుటకు డాలు పారవైచినం గాని తీరదు. 'డాలు మీఁదవచ్చుట' యనగా యుద్ధమునఁ బోరి ప్రాణ మర్పించి దానిమీఁద మోసికొని రాఁబడుటయె.

స్పార్టనుస్త్రీల కింటి యాజమాన్యము ముఖ్యతమము. ముప్పదేండ్లవయసున పురుషుఁడును, నిరువదేండ్లప్రాయమున స్త్రీయును, రాష్ట్రమునకుఁ బౌరుల నుత్పత్తిసేయు నుద్దేశముతోఁ బెండ్లిచేసికొనియే తీరవలసినవా రగుటచేతను పురుషులు వివాహానంతరము గూడ నరువదేండ్ల ముదుసలులగునరకు సామాన్యభోజనశాలల భుజించుచు రాష్ట్రకార్యములయందే నిమగ్నులయి యుండవలసి యుండుటచేతను గృహవిషయములెల్లయు స్త్రీయాజమాన్యము క్రిందనే వచ్చెడివి.

స్పార్టను పురుషులకు యుద్ధమునిన పండుగ. ఆ సమయమున వారికి నెప్పటికంటె రుచికరంబగు నాహారము నిత్తురు. నిర్బంధములును గొన్ని తగ్గిపోవును. ఉత్తమవస్త్రములగట్టి తమ పొడుగాటి వెంట్రుకల సుందరముగ దువ్వుకొని పూమాలలను ధరించి సంగీతంబుల కలరుచు యుద్ధరంగంబునకు వివాహవేదికకువలె మహోత్సాహమున గవచము, డాలు, ఖడ్గము దమ కాంతులచే నూతనాతప

మొనరించుచుండ నిర్ణీతనాయకుల యనుజ్ఞల ననుసరించి సంఘము సంఘముగఁ, బటాలము పటాలముగ నడచు చుండుస్పార్టను యోధులయెదుట అభ్యాసశూన్యములును నంగవిశిష్టతాశూన్యములునునగు నితరరాష్ట్రసైన్యములు నిలువలేకుండె ననిన నేమి చిత్రము?

ఇట్లు యుద్ధభటులగుటకు మాత్రమె ప్రయాసపడు స్పార్టనులు వ్యవసాయాదికార్యములకుఁ బూనుట గౌరవ హానియని యెంచుచుందురు. వీరి కా పనులఁ జేయుటకు నితరు లేర్పడియుండిరి. వీరు గాక స్పార్టాభూముల నింక రెండు తెగల ప్రజయుందురు. వీరిచే జయింపఁబడి వీరికి లోఁబడిన స్వదేశీయులును, వారి కంటెను బూర్వమునుండి వారికే పరిచారకులుగ నుండిన 'హీలటు'లనువారును. స్వదేశీయులగు 'మండలీకులు' లకోనియా (అనఁగా స్పార్ట నులసీమ) యందలి యితరపట్టణముల పౌరతకర్తలు. వీరును సైనికాభ్యాసములఁ దేరి సమయానుకూలముగ స్పార్టనుల సేనాసమూహమునఁ జేరవలయును. కాని స్పార్టనులకు గల నిర్బంధములు వీరికి లేవు. వీరు కృషి వాణిజ్యాదుల జీవితము గడపవచ్చును. నిరాతంకముగఁ దమ యిచ్చవచ్చినపగిది బ్రతుక వీరికి స్వాతంత్ర్యముగలదు. యుద్ధసమమున డాలుఖడ్గముల ధరించి స్పార్టనులకుఁ బ్రబలసాహాయ్యులగుటయు స్పార్టన రాజప్రతినిధుల యధి

కారముక్రింద, దమ పట్టణరాజ్యతంత్రముల నడుపుకొను టయుఁ దక్క వీరి కితరసంబంధములు లేవు.

ఇఁక హీలటుల సంగతి. వీరు బానిసలుగారు. కాని స్పార్టనుయజమానులకై వీరు పని సేయక తప్పదు. వారి భూములను దున్ని పైరుబెట్టి సంవత్సరాంతమున నగుఫల మునందుఁ గొంతభాగము వారికియ్యవలయును. తక్కినది జీవనార్థ ముపయోగించు కొనవచ్చును. ఇంతియకాక స్పార్టనుపౌరుల యిండ్లకడ నౌకరీసేయుటయు వీరి పనియె. యుద్ధసమయములఁ దమ యజమానుల వెంటనంటి నడచి వారికి సహాయ్యులుగ యుద్ధము సేయుటో లేక వారికి సేవకులుగ నుపచరించుటో వీరి ధర్మము. వీరి సంఖ్య కొంచెమెక్కుడుగ నుండుటవలన స్పార్టనుపౌరులు భయము గలవారై వీరి నెప్పుడును గాచియుండుటయు వీరిలోఁ గొంచెము దలయెత్తికొని తిరుగు బలవంతులను హింసించు టయు నొక్కొకతరి జంపించుటయుఁ గూడఁ దటస్థించు చుండెను. అందు మన హీలటులకుఁ బౌరులయెడ మిక్కిలి విరోధభావముండెడిది. అయినను వీరెప్పుడును వారికి బహూపయోగకారులుగ నుండిరనుటకు సంశయము లేదు.

ఉత్తమసంస్కారముల నెల్ల నివ్విధమునఁ బ్రచారమునకుఁ దెచ్చి లైకర్గసు తాను మరలివచ్చువరకుఁ దన చట్టముల నిరాతంకముగ నడుపునట్లు స్పార్టనుపౌరులనుండి వాగ్దా నము దీసికొని డెల్ఫీకి వెడలిపోయెను. అచ్చట దేవుని

నారాధించి తన చట్టములు శాశ్వతముగ నుండవలెనను తలంపునఁ దాను మరలి స్పార్టాకుఁ బోకూడదని తీర్మానించి ప్రాణత్యాగము చేసెనట. ఇట్లు దేశక్షేమమునకై దేహమర్పించిన లైకర్గసు తలంపులు వ్యర్థము గాలేదు. ఎంతకాలము స్పార్టాజనులు లైకర్గసుచట్టముల ననుసరించిరో యంతకాలము రాజ్యాంగకార్యనిర్వాహణమందును బ్రతాపకీర్తులయందును గ్రీసునందెల్ల నుత్తములయి పరగిరి.

## ఐదవ ప్రకరణము

## స్పార్టనుల దిగ్విజయము

గతప్రకరణమున ఆర్గాసు టిమీానసునకుఁ జేరెనని వ్రాసితిమి. అతనికి తరువాత రెండువందల సంవత్సరముల కాల మా రాష్ట్ర మొక్క రాజు నధికారమున దప్ప మఱె ప్పుడును బ్రాముఖ్యత గాంచ లేదు. ఆ ప్రబలుఁడయిన రాజు పేరు 'ఫీడను.' అతఁడు సుమారు క్రీ. ము. 700 సంవత్సర ప్రాంతముల నుండినవాఁడు. తాను హిరాక్లీసు సంతతియందు ప్రథమశాకకుఁ జేరినవాఁడగుట దన పూర్వికుని రాజ్యమునకంతయుఁ దనకర్తృత్వ గలదనియుఁ, దా నాయర్తృత్వ ను యుద్ధములుసేసి నిలుపుకుందు ననియు, నతఁ డుత్సహించెను. మిక్కిలి బలపరాక్రమములు గలశూరుఁ డతండగుట కేమియును సందియము లేదు. కాని యుత్సహించుటకును జయించుటకును మధ్యకాలమున నెన్నియో యాటంకములు గలవు. ఫీడను మఱియొక యపారంబగు నాశగొనియెను. ఒలింపియా యుత్సవములు దనకు మూలపురుషుండగు హేరక్లీసువలన స్థాపితమయ్యె ననియుఁ, గావునఁ దాన యీ యుత్సవకాలముల నగ్రాసనాసీనత్వమున కర్హుండనియు నతఁడు హక్కు స్థాపించుకొనఁ బ్రయ

త్నించి తన్కాలమునఁ బరాజయంబందెను. అక్కాలమున నొలింపియా పండుగలకు ఎలిసుమండలప్రజ ఉత్తరవాదిగ నుండిరి. పండుగలను క్రమముగ జరుపుటకును, అవి నడచు ప్రదేశములను సంరక్షించుటకును, ఆ నడచు దివసంబుల నొక్కమాసము శాంతి ప్రకటించుటకును, వారికె స్వాతంత్ర్యము గలదు. 'పైసాటనులు' అనగా పైసామండలవాసులు, జ్యూసుదేవాలయము దమ భూముల నుండుట వలన నీ స్వాతంత్ర్యములఁ దాము సంపాదించి గౌరమందవలయునని యెప్పుడును బ్రయత్నించుచుండిరి. ఫీడ నా విషయమును గనిపెట్టి తాను వారిపక్షమువ్వానినఁ దన మనోరథము సిద్ధించునను తలంపున సైన్యముంగొని పైసాటనులచే నొలింపియా పండుగల నడిపించి తా నగ్రాసనాధిపత్యము వహించెను. ఇప్పగిది పైసాటనులు దమ స్థానమాక్రమించుకొనుటయు ఫీడను స్పార్టారాజుల గౌరవమునకు హాని గలిగించుటయు సహింపలేక ఎలిసుమండలవాసులు స్పార్టాకీ విషయంబుల నెఱుకపఱచి తమ గత వైభవంబును బునరుజ్జీవనం బొనర్పవలసినదని వేడిరి. విగ్రహము ప్రారంభమాయెను. స్పార్టనులు విజయులై ఎలిసును బూర్వ స్థానంబున నునిచిరి. ఫీడనాధిపత్యముక్రింద జరగిన నొలింపియోత్సవము రద్దుచేయఁబడియెను.

ఫీడనుబల మీవిధమున నశించిపోయెను. కాని యతనిపేరు గ్రీసుదేశమున ప్రప్రధనముగ (నూనికలును

కొలతలును) ఉపక్రమించిన వాఁడని ప్రసిద్ధిగాంచియున్నడు. ఆర్గసు గూడ గానవిద్యకును, చిత్రశిల్పనమునకును మిన్న యని తరువాతికాలమున చెన్నువహించి తన దేవాలయముల సౌందర్యమువలన సర్వదిగ్భాగములనుండి చూపరు నాకర్షించి వారిని దన్జూచుటచే ననిమిషులుగ మార్చుచుండెను.

స్పార్టను లల్లనల్లన దమ పట్టణరాష్ట్రమును వ్యాపింపఁ జేయుచుండిరి. యురోటసు నదీతీరముల దిగిన ఈ డోరియనులు దమ పల్లియపట్టునుండి గదలి కొంచెముగొంచెముగ లకోనియాయంతయు నాక్రమించిరి. పశ్చిమమున టెయిగటసుపర్వతములు దమకును మెస్సీనియాకును మధ్యరేఖగ నుపచరించుచుండెను. తమ సంఖ్య యెక్కుడగుఁ గొలఁది యా రేఖను దాటుటకు వీరికిఁ బ్రోత్సాహము గలుగుచుండె. ఇంతియ గాక మెస్సీనియా భూస్వభావంబును వీరి నాకర్షించుచుండెడిది. జలసమృద్ధిచే నొప్పి, విశేషప్రయత్నము లేక సస్యసంపూర్ణత నొసంగగలిగిన సమశీతోష్ణస్థితుల కాకరంబగు నుత్తమసమభూము లేరింజీరవు. అందున దరిద్రులై దినదినమును బెరుగుచుండు స్పార్టనులవంటి ప్రజకు దమపై గాఢానురాగ మివి పుట్టించెననుట కేమి సందియము. ఆశయున్నను నాక్రమించుకొనుట కెద్దియో యొక కారణముండవలయు గదా? ఇరుగుపొరుగు వారలు పోట్లాడ దలచుకొనిన కారణములు దక్కువా? మెస్సీనియా